తెలంగాణ శాసనసభ
దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం
సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA
TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 178 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | మంగళవారం 03 డిసెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-



రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం...

## లారీ దూసుకొచ్చి ఆరుగురు మృతి

- చేవెళ్ల మండలం ఆలూరు స్టేజీ వద్ద లారీ బీభత్సం
- కూరగాయల వ్యాపారుల పైకి దూసుకెళ్లిన లారీ
- ఏడుగురి పరిస్థితి విషమం

మిగతా »»3లో

## మా తలరాతలు మార్చిన మీరే

## ఈ ప్రభుత్వాన్ని కూడా

# కాపాడుకోవాలి!



- పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా? అన్న సీఎం
- ప్రభుత్వంపై జరుగుతోన్న విషప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపు
- తెలంగాణ సమాజమే మా కుటుంబమన్న రేవంత్ రెడ్డి

మిగతా »»3లో

## గత పదేళ్ళు ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి గురైంది..

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న నేపథ్యంలో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తోంది.

**శాసనసభ / హైదరాబాద్ :** ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ లో హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో ఆరోగ్య ఉత్సవాలు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..పెద్దయెత్తున ఉద్యోగ నియామకాలు చేపడుతూ... నియామక పత్రాలు అందించడం.ఆనందం గా ఉందన్నారు.బడుగు, బలహీన వర్గాల అవసరాల ను తీర్చడం కోసం.. ప్రతినెల ఆరోగ్య



శాఖ కు నిధులు విడుదల చేయాలంటే నీళ్ళు మింగాల్సిన పరిస్థితి అని, ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి ఆరోగ్య శాఖ పై ప్రత్యేక దృష్టి సారించి ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు.

మిగతా »»3లో

### కేసీఆర్ ను రేవంత్

## 'కలుపు మొక్క'

### అనడంపై కవిత స్పందన



- కేసీఆర్ ను కలుపుమొక్క అన్న రేవంత్
- తెలంగాణను సాధించిన శక్తి కేసీఆర్ అన్న కవిత

మిగతా »»3లో

## సీఎం అభ్యర్థి పేరు ప్రకటన

## మళ్లీ వాయిదా? ఎందుకో..!



**ఢిల్లీ/శాసనసభ :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎంపిక డైలీ సీరియల్‌గా కొనసాగుతోంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలొచ్చి దాదాపుగా 9 రోజులైంది. కానీ ఈరోజుకి సీఎం అభ్యర్థి పేరు ప్రకటించలేదు. ఈరోజు.. రేపు అంటూ ఊరిస్తున్నారే తప్ప.. అధికారికంగా అభ్యర్థి పేరు మాత్రం ప్రకటించలేకపోతున్నారు. వాస్తవానికి మహారాష్ట్ర ప్రభుత్వ కాలం ఎప్పుడో ముగిసింది.

మిగతా »»3లో

## పేదవాని వైద్యం, విద్య మా బాధ్యతగా భావించేది. కాంగ్రెస్ పార్టీ..



**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ లో హెచ్ఎండీఏ గ్రౌండ్స్ లో 213 అంబులెన్స్ లకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ. పేదవాని వైద్యం, విద్య మా బాధ్యతగా భావించేది..కాంగ్రెస్ పార్టీ అని ఆయన అన్నారు.

## ఈ నెల 7న ప్రభుత్వ వైఫల్యాలపై

## ఛార్జిషీట్ వేస్తామన్న హరీశ్ రావు

- డబుల్ టంగ్ లీడర్లతో ప్రమాదమన్న హరీశ్ రావు
- రాక్షసులు అన్న నోటితోనే దేవతలు అంటారని ఎద్దేవా
- రేవంత్ రెడ్డి రెండు తలల పాము కంటే డేంజర్

**శాసనసభ / హైదరాబాద్ :** మనం రెండు తలల పామును చూసి భయపడతాం... పాపం అది ఏమీ అనదు... పెద్ద ప్రమాదకరం కాదు... కానీ రెండు నాల్కల ధోరణి కలిగిన మనషులు చాలా ప్రమాదమన్నారు. కానీ అలాంటి వారిని మనం పెద్దగా పట్టించుకోమన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు తలల పాము కంటే డేంజర్ అని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు.



బీఆర్ఎస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రెండు నాల్కల వైఖరికి నిదర్శనం నిస్సందేహంగా రేవంత్ రెడ్డే అన్నారు.

## సుప్రీంకోర్టు కోర్టు ఆదేశాలతో

### ఎస్సీ వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నాం.



**శాసనసభ / హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..

మిగతా »»3లో

## రైతులకు లాభాలు తెచ్చిపెట్టే పంట

# ఆయిల్పామ్

- తెలంగాణను ఆయిల్ పామ్ సాగు హబ్గా మార్చడమే నా జీవిత లక్ష్యం
- విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు




**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణను ఆయిల్పామ్ సాగు హబ్గా మార్చడమే తన జీవిత లక్ష్యం అని, తద్వారా పామాయిల్ సాగుతో రైతులు పేదరికం నుంచి రాజులుగా మారాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో నూతనంగా నిర్మించబోతున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాఫ్ట్వేర్ ఇంజినీర్లు పొలం బాట పట్టేలా ఆయిల్ పామ్ సాగును చేయించే విధంగా చూడాలన్నారు. ఇంపోర్ట్ ట్యాక్స్ పెంచడం వల్ల దేశీయంగా ఆయిల్ పామ్ రైతాంగంకు లాభాలు వస్తున్నాయని, ఏడాదికి లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

»»3లో

## సరికొత్తగా తెలంగాణ తల్లి

## విగ్రహం తయారీ..

ఆ రూపం వెనుక సిక్రెట్ ఇదేనా..?



## భారత్‌లో పర్యటించండి..

## పుతిన్‌కి మోడీ ఆహ్వానం..



## హైడ్రాకు తూట్లు పొడిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శ



శాసనసభ / హైదరాబాద్ : హైదరాబాద్‌ను కాపాడాలనే ఉద్దేశంతోనే హైడ్రాను తీసుకువచ్చామని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. దీనికి కూడా తూట్లు పొడిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొన్నేళ్లపాటు కేబినెట్లో మహిళలకు చోటు కల్పించని పార్టీ బీఆర్ఎస్ అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సమగ్ర సర్వే చేయించి ఆ తర్వాత దానిని అటకెక్కించారని విమర్శించారు. బీసీలకు బీఆర్ఎస్ అనుకూలమా? కాదా? చెప్పాలని నిలదీశారు. దామాషా పద్ధతిలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఫలాలు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే తాము బీసీ గణన చేపడుతున్నట్లు చెప్పారు. బతుకమ్మ చీరల పేరిట గత ప్రభుత్వం నేతన్నల జీవితాలను ఆగం చేసిందన్నారు. సూరత్ నుంచి చీరలను తెచ్చి ఇచ్చారని మండిపడ్డారు. ఆ చీరలు కూడా మహిళలు కట్టుకోవడానికి ఉపయోగపడలేదని... పంటచేలలో బెదురు పెట్టేందుకు ఉపయోగపడ్డాయని విమర్శించారు. ఒక్క డీఎస్సీ ఇవ్వని ప్రభుత్వం కేసీఆర్‌దే అన్నారు. గ్రూప్-1 పేపర్లు లీక్ చేసిన చరిత్ర ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సినిమాకు శుభం కార్డు పడిందని చురక అంటించారు.

## వరప్రసాద్‌రెడ్డికి తెలుగు వర్సిటీ విశిష్ట పురస్కారం



శాసనసభ /హైదరాబాద్ : ప్రముఖ పారిశ్రామికవేత్త, శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డికి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విశిష్ట పురస్కారాన్ని ప్రదానం చేసింది. సాంస్కృతిక రంగానికి ఎనలేని సేవలందించినందుకు 2023వ సంవత్సరానికి వరప్రసాద్‌రెడ్డిని ఎంపిక చేసింది. బాచుపల్లిలోని నూతన క్యాంపస్‌లో సోమవారం జరిగిన వర్సిటీ 39వ వ్యవస్థాపక దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

**లక్ష స్వీకరించి.. కోటి విరాళం..**

గుప్తదానాలు, దాతృత్వంలో ఎల్లప్పుడూ ముందుండే వరప్రసాద్‌రెడ్డి సోమవారం మరోసారి తన మనస్సును చాటుకున్నారు. విశిష్ట పురస్కారం కింద తెలుగు వర్సిటీ ఆయనకు రూ.లక్ష చెక్కు అందించగా, ఆ చెక్కును స్వీకరించిన వరప్రసాద్‌రెడ్డి అదే వేదికపై తెలుగు వర్సిటీకి రూ.కోటి విరాళాన్ని అందజేశారు. వర్సిటీలో మౌలిక వసతుల కల్పనకు తనకు అందించిన లక్షతోపాటు మరో కోటి చెక్కును మంత్రి అందించారు.

## భారత్ నుంచి తొలి దేశీయ యాంటీబయాటిక్

### త్వరలో అందుబాటులోకి 'నఫిత్రోమైసిన్' ఔషధ నిరోధక నిమోనియాకు విరుగుడు



శాసనసభ /హైదరాబాద్ : ఔషధాలకు లొంగని వ్యాధికారకాల పని పట్టించే యాంటీబయాటిక్ 'నఫిత్రోమైసిన్'ను భారత్ తయారుచేసింది. కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీలో భాగమైన బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రిసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్ఏసీ) ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసింది. భారత్‌లో దేశీయంగా అభివృద్ధి చేసిన మొట్టమొదటి యాంటీబయాటిక్ ఇది. ఔషధాలకు లొంగని కమ్యూనిటీ అక్వైర్డ్ బ్యాక్టీరియల్ నిమోనియా(సీఏబీపీ) చికిత్స కోసం పెద్దలకు ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. ఇప్పుడు నిమోనియా చికిత్సకు ఎక్కువగా అజిత్రోమైసిన్ వాడుతున్నారు. అయితే, వ్యాధికారకాలు ఔషధ నిరోధక శక్తిని పెంచుకుంటుండటంతో చాలామంది రోగుల్లో అజిత్రోమైసిన్ సరిగ్గా పని చేయడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా నిమోనియా చికిత్సకు నఫిత్రోమైసిన్ సమర్థంగా పని చేస్తున్నది. రూ.500 కోట్ల పెట్టుబడితో 14 ఏండ్ల పరిశోధన ద్వారా ఈ ఔషధాన్ని తయారుచేశారు. త్వరలో 'మిక్నాఫ్' పేరుతో ముంబైకు చెందిన ఫార్మా కంపెనీ వొల్కార్డ్ ఈ ఔషధాన్ని మార్కెట్‌లోకి తీసుకురానున్నది.

# రైతు రుణమాఫీ ఎవరికైంది?

## రుణమాఫీ పూర్తయ్యిందన్న ప్రభుత్వ ప్రకటనపై రైతుల ఆక్రోశం

శాసనసభ / హైదరాబాద్ : నిన్నటిదాకా రైతుల రుణాలను మాఫీ చేస్తామన్న ప్రభుత్వం.. చివరిపాట కూడా పాడేసింది! 'రుణమాఫీ పూర్తయ్యింది. వంద శాతం అమలు చేసేశాం' అన్న సీఎం ప్రకటనతో అవాక్కవడం రైతుల వంతయ్యింది. కనీసం నాల్గో జాబితాలోనైనా తమ పేరు వస్తుందనుకుని ఆశగా ఎదురుచూసిన రైతులు చివరకు హతాశులయ్యారు. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల రైతులు రోడ్డెక్కారు. సర్కారు ధోకాపై కన్నెర్ర చేశారు. 'రుణమాఫీ ఎవరికై ంది? మా సంగతేంది?' అంటూ ఎక్కడికక్కడ అధికారులను నిలదీశారు. ఇక2 లక్షలపైన రుణం ఉన్న రైతుల పరిస్థితి మరీ దారుణం. సర్దిచెప్పేవారు లేరు. సమాధానం చెప్పేవారూ లేరు.

రాష్ట్రప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ చేసినట్టు ప్రకటించింది. ఈ క్రమంలో అందరికీ రుణమాఫీ జరిగినట్టు సీఎం రేవంత్ సహా మంత్రులు చెబుతున్నారు. అయితే చాలా మంది రైతులు మాత్రం తమకు రుణమాఫీ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. రూ. 2 లక్షలలోపు రుణం తీసుకున్నా తమకెందుకు కావడం లేదంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు. సాంకేతిక కారణాలు చెబుతూ అధికారులు దాటవేస్తున్నా, అన్నదాతలు మాత్రం అయోమయంలో పడ్డారు. మూడు విడతల్లో పేరు రాని వారు నాలుగో విడత జాబితా కోసం ఎదురు చూశారు. అందులో అయినా తమ పేరు వస్తుందేమోనని ఎంతో ఆశతో ఉన్నారు. వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. తమకు మాఫీ ఎందుకు కాలేదో తెలియడం లేదంటూ పలువురు రైతులు 'నమస్తే తెలంగాణ'తో తమ మనోవేదనను ఇలా పంచుకున్నారు.

**నా రుణం మాఫీ కాలేదేం?**

వ్యవసాయ అధికారిని నిలదీసిన కాంగ్రెస్ నాయకుడు

'రైతులమందరం దరఖాస్తు చేసుకున్నం. రెండు నెలలక్రితమే ఇంట్లో అందరి ఆధార్ కార్డులు ఇచ్చినం. అయినా రుణమాఫీ కాలేదు. అట్లాంటప్పుడు అప్లికేషన్లు ఎందుకిచ్చినం? అంత సక్కగ ఉంటే గిట్లెందుకైతది' అంటూ నర్సింహులపేట రైతువేదికలో ఏవో వినయ్ కుమార్‌ను సోమవారం నిలదీశారు మహబూబాబాద్ జిల్లా పెద్దనాగారం స్టేజీ గ్రామ కాంగ్రెస్ నాయకుడు బొబ్బ అశోక్‌రెడ్డి. దంతాలపల్లి మండలంలోని ఏపీజీవీబీ శాఖలో తన పేరిట లక్షా 70వేల పంట రుణం ఉన్నదని, రేషన్‌కార్డులో పేరు లేదనడంతో రెండు నెలలక్రితం దరఖాస్తు కూడా ఇచ్చానని తెలిపారు. అయినా ప్రభుత్వం చెప్తున్నట్టు తనకు రుణమాఫీ జరగలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తనతోపాటు దరఖాస్తు చేసుకున్న 300 మంది రైతులకూ మాఫీ కాలేదని వాపోయారు. నర్సింహులపేట

**55వేల రుణమాఫీ కాలేదు**

నా బ్యాంకు ఖాతాకు జాటోత్ రమేశ్ అనే అతడి ఆధార్ కార్డు నంబర్‌ను అధికారులు నమోదు చేశారు. 4 నెలల నుంచి పీఏసీఎస్, ఏవో ఆఫీస్ చుట్టూ తిరిగితే తప్పును సరిదిద్దేందుకు దరఖాస్తు చేయమన్నారు. ఇప్పటి వరకు అధికారులు నా ఖాతకు వేరే వ్యక్తి ఆధార్ నంబర్ తొలగించకపోవడంతో నా రూ.55 వేల రుణం మాఫీ కాలేదు. పేద రైతులకు అన్యాయం చేస్తే కుటుంబం ఉసురు తుగులుతుంది.

**- జేరిపోతుల రమేశ్, కొమ్ములవంచ రైతు**

80వేలు బ్యాంకుకు చెల్లించినా మాఫీ కాలేదు

దంతాలపల్లి మండలం ఏపీజీవీబీ బ్యాంకులో రూ. 2.70 లక్షలు అప్పు తీసుకున్నా. రూ.2లక్షలకుపైన ఉన్న రూ.80వేలు బ్యాంకు లో చెల్లించి మూడు నెలలు అవుతున్నది. ఇప్పటి వరకు మాఫీ చేయలేదు. బ్యాంకులో కట్టిన 80 వేలు అప్పుగా తీసుకొచ్చిన. మిత్తి పెరుగుతున్నది.

**అజ్మీరా ఆశానాయక్, గోపతండా**

**రుణమాఫీ జరిగేదెప్పుడు?**

బ్యాంక్ అధికారుల తప్పిదంతో రుణమాఫీ ఐత లేదు. పంట రుణం రూ.1.50 లక్షలు తీసుకు న్న. యూనియన్ బ్యాంక్ అధికారులు పంట రుణం రెండు సార్లు తీసుకున్నట్టు నమోదు చేసిన్రు. దీంతో రుణమాఫీ కావడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంక్ అధికారులతోపాటు కలెక్టర్‌ను కలిసి చెప్పినా ఫలితం లేదు. అధికారులు చేసిన తప్పును సరిదిద్దాలని కోరితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రుణమాఫీ నమోదులో ఎడిట్ ప్రక్రియకు అనుమతి ఇవ్వలేదని అధికారులు తిప్పుతున్నరు.



**పేర్ల రాకేశ్, మనుగొండ, వరంగల్**

**55 వేల రుణం మాఫీ కాలేదు**

ఊకల్ రైతు సహకార సంఘంలో రూ. 55 వేల పంట రుణం ఉంది. రెండు సార్లు మాఫీ ప్రకటించిన జాబితాల పేరు లేదు. సహకార సంఘం సీఈవో, వ్యవసాయ అధికారులను అడిగితే ఆన్‌లైన్‌లో చెక్ చేసి నీ బ్యాంకు ఖాతాకు మరో రైతు ఆధార్‌కార్డు నంబర్ లింక్ అయిందని చెప్పిన్రు. వచ్చే జాబితాలో మాఫీ అయితదన్నరు. ప్రభుత్వం రూ. రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ చేశామని చెప్తున్నది కానీ నాకు రూ. 55 వేల మాఫీ రాలేదు.

**- జిన్ర శరత్‌కుమార్, రైతు, మచ్చాపురం, వరంగల్**

1.8 లక్షలున్నా మాఫీ కాలేదు

పరకాలలోని డీసీసీ బ్యాంకులో నా కుటుంబానికి రూ.1.8లక్ష ల లోన్ ఉన్నది. నా పేరు మీద రూ. లక్షా పదివేలు, కొడుకు పేరుమీద రూ. 74వేల రు ణం ఉన్నది. ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాలో నా పేరులో హెచ్ అనే అక్షరం తేడా ఉండగా, మా కొడుకు పేరు అనుదీప్ బదులు చిరుదీప్‌గా నమోదు కావడంతో రుణమాఫీ కాలేదు. రూ. సీఎం రేవంత్‌రెడ్డి ఏమో 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేసినం అని అంటున్నడు.. నాకే మో రుణమాఫీ గాకపాయె.

**తాళ్లపల్లి సంధ్యారాణి, నర్సక్కపల్లి, నడికూడ, హనుమకొండ**

**రుణమాఫీలో అన్యాయం చేశారు!**

2021లో శాయంపేట పీఏసీఎస్‌లో రూ.95వేలు రుణం తీసుకున్న. ఇప్పటి వరకు దీనిని రూ.1.42లక్షలు చేశారు. ఇందులో సీఈవో రూ.32వేలు అదనంగా కలిపి పెంచేశారు. కానీ నాకు రుణమాఫీ కాలేదు. నాభార్య స్వాతి పేర 2023 నవంబర్‌లో రూ.1.50 లక్షల రుణం తీసుకున్నాం. రూ.2లక్షల కన్నా ఎక్కువగా ఉన్న డబ్బులు కట్టాలని అధికారులను అడిగితే కట్టినా రుణమాఫీ జరగదు, ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. చాలా మంది భార్యాభర్తలు రూ.2లక్షల రుణం కోసం పైనున్న డబ్బులు చెల్లించారు. కానీ ఎవరికి రుణమాఫీ కాలేదు. రుణమాఫీ పూర్తయినట్టు సీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉంది. ఇప్పటికైనా రూ.2లక్షల రుణమాఫీని భార్యాభర్తలకు వర్తింపజేయాలి.

**దాసి శ్రావణ్‌కుమార్, రైతు, గోవిందాపూర్, శాయంపేట, హనుమకొండ**

**మంత్రి మాటలు నమ్మి 20 వేలు బ్యాంకులో కట్టిన**

బ్యాంక్ ఆఫ్ బరోడా ఐనవోలు బ్రాంచిలో 2024 జనవరిలో నా పేరు మీద రూ. 99 వేలు, భార్య స్వరూప పేరు మీద రూ.95 వేల రుణం తీసుకున్న. ఇద్దరిదీ కలుపుకొని రూ. లక్షా 94 వేల రుణం ఉంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలు నమ్మి బ్యాంక్‌లో రూ. 20 వేలు జమ చేసిన. అయినప్పటికీ లోన్ మాఫీ కాలేదు. మంత్రి నాగేశ్వర్‌రావు రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేస్తాం. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న అమౌంట్‌ను బ్యాంక్‌లో జమ చేయాలని చెప్పడంతో మా ఇద్దరి పేర్ల మీద రూ.20 వేల బ్యాంక్‌లో జమ చేశాం. అయినా రుణమాఫీ కాలేదు.

**పెంతల రవి, రైతు, ఒంటిమామిడిపల్లి, హనుమకొండ**

**కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది**

మోసపూరిత హామీల తో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిం ది. నాకు 3ఎకరాల భూమి ఉంది. బ్యాంకు లో రూ.1.42 లక్షల రు ణం ఉండగా మూడో వి డతలో రుణమాఫీ కాలేదు. వ్యవసా యాధికారులు విచారణ చేసి రేషన్ కార్డులో పేరు లేకపోవడం వల్ల రుణమాఫీ కాలేదన్నరు. మా కుటుంబంలో నా ఒక్కడి పేరు మీదనే వ్యవసాయ భూమి, క్రాప్ లోన్ ఉంది. వ్యవసాయాధికారులు కుటుంబ వివరాలు సేకరించి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకుని కుటుంబంలో ఒకరికి మాత్రమే అప్పు ఉందని నిర్ధారించి వివరాలను నమోదు చేసుకున్నారు. 4వ విడతలో కూడా రుణమాఫీ కాలేదు.

**మేకల యాదగిరి రైతు, నారాయణగిరి, ధర్మసాగర్, హనుమకొండ**

**మాకు రుణమాఫీ ఎప్పుడైతది**

నేను యూనియన్ బ్యాంకు ఊకల్ బ్రాంచి లో పంట రుణం తీసుకు న్న. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు తీసుకున్న రూ. 2లక్షల లోపు రుణాలను మాఫీ చేస్తామని చెప్పింది. నేను, నా భార్య పేరుమీద ఉన్న 2లక్షల పైన ఉన్న రూ. లక్షా 36వేలను అప్పులు తీసుకొచ్చి ఆగస్టులోనే బ్యాంకులో రుణం కట్టినం. ఇప్పటి వరకూ రుణమాఫి కాలేదు. ముఖ్యమంత్రి, మంత్రులేమో రూ. 2లక్షల వరకు రుణమాఫీ చేశామంటున్నరు. రుణమాఫీ కాలేదు, రైతుభరోసా లేదు.. దీంతో మరింత అప్పుల పాలయ్యాం. కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధుతో పంటల సాగుకు డబ్బులు సమయానికి సక్కగొచ్చేవి.

**కొనకటి మొగిలి, రైతు,మొండ్రాయి, సంగెం, వరంగల్**

**అప్పు తెచ్చి కట్టినా కాలే..**

ఐదెకరాల వ్యవసాయభూమి ఉంది. యూబీఐలో పంట పెట్టుబడి కోసం క్రాప్‌లోన్ రూ. రెండు లక్షలు తీసుకున్న. రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి చెప్పడంతో సంబురపడ్డ. మూడోవిడత రుణమాఫీ చేసేముందు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రెండు లక్షల లోపు క్రాప్‌లో న్ రుణాలుంటే మాఫీ చేస్తామని చెప్పడంతో అప్పు తెచ్చి కట్టిన. అయినా ఇప్పటి వరకు రుణమాఫీ కాలే. నా భార్య రాణి పేరిట రెండెకరాల వ్యవసాయభూమి ఉం ది. పంట పెట్టుబడికి ఆమె రూ. 90వేలు క్రాప్‌లోన్ తీసుకుంది. ఆ 90వేలు కూడా మాఫీ కాలే. ఒకే రేషన్ కార్డుపై ఒకరిది మాత్రమే మాఫీ చేస్తామని అధికారులు అంటున్నరు. నా పేర ఉన్న 2లక్షలు మాఫీ కాకున్నా, భార్య పేరుతోఉన్న 90వేలు మా ఫీ కావాలే కదా. విజయోత్సవాల పేరిట కళాకారులు వచ్చి రుణమాఫీ అయిందని చెప్పుతున్నరు. నాకేమో కాకపాయే.

**- మేకల రవి, రైతు, లక్ష్మీపూర్, హనుమకొండ**

**కాంగ్రెసోళ్లు మాట మార్చిన్రు**

మాకున్న భూమి మీద కొంచవెల్లి గ్రామీణ బ్యాంక్‌లో నా పేరున రూ.1.60 లక్షలు, భార్య పేరున రూ.లక్ష రుణం తీసుకున్నం. ఇద్దరికీ కలిపి రూ. 2 లక్షలు రుణమాఫీ చేసి మిగతా రూ. 60 వేలు కట్టమంటే కట్టేటోళ్లం. ఇప్పుడు రూపాయి కూడా మాఫీ కాకపాయె. ఎన్నికలప్పుడు అందరికీ రుణాలు మాఫీ చేస్తామన్న కాంగ్రెసోళ్లు అధికారంలోకి రాగానే మాట మార్చిన్రు.

**ఇస్లావత్ గోపాల్, కల్వాడ, ఆసిఫాబాద్ జిల్లా**

**1.68 లక్షలు మాఫీ కాలేదు..**

అన్నపురెడ్డిపల్లి ఏపీజీవీబీలో ఉన్న రూ 1.68 లక్షల పంట రుణం మాఫీ కాలేదు. రూ.2 లక్షలలోపు రుణమాఫీ జాబితాలో పేరు లేదు. మొదటి విడతలో రుణమాఫీ కాలేదని అధికారులను అడిగితే.. నీ భార్య, నీ పేరు కలిసి రూ.2 లక్షలకు పైగా రుణం ఉన్నందున మాఫీ కాలేదని చెప్పారు. భార్య పేరుతో ఉన్న పంట రుణం మొత్తాన్ని మార్చిలోనే చెల్లించానని చెప్పగా బ్యాంకు నుంచి నోడ్యూ సర్టిఫికెట్ తెచ్చుకొని మరోసారి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మళ్లీ రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకున్నా మాఫీ రాలేదు. ఇప్పుడు వ్యవసాయ, బ్యాంకు అధికారులను అడిగితే.. జాబితా పంపించామని చెప్పారు. రుణమాఫీ వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**- పలగాని పుల్లయ్య, రైతు, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

**లక్షన్నరలోపు మాఫీకాలేదు..**

ఏదులాపురం సొసైటీలో పంటరుణం తీసుకున్నా. అసలు వడ్డీ కలిపి రూ.1.50 లక్షలు అయ్యిందని సొసైటీ వాళ్లు చెప్పారు. పేరు కూడా పైకి పంపామన్నారు. కానీ ఇంతవరకు మాఫీ కాలేదు. రెండు నెలలుగా తిరుగుతున్నా. నాలుగో విడత వచ్చిందంటే మళ్లీ వచ్చాను. దీంట్లో కూడాపేరు లేదు. నాతోపాటు రుణాలు తీసుకొని నాకంటే ఎక్కువగా వడ్డీ అయినోళ్లకు మాఫీ వచ్చింది. ఎవరిని అడగాలో తెలియడం లేదు.

## మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై స్పందించిన డీజీపీ జితేందర్




శాసనసభ /హైదరాబాద్ : ములుగు జిల్లా ఏటూరునాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పలువురు పౌరహక్కుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి.. ఆ తర్వాత ఎన్‌కౌంటర్ చేశారనే ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ డీజీపీ జితేందర్ స్పందించారు. మావోయిస్టులపై విష పదార్థాలను ప్రయోగించామనేది దుష్ప్రచారమన్నారు. మావోయిస్టులు స్పృహ కోల్పోయాక కాల్పులు జరుపామనడం అవాస్తవమని.. మావోయిస్టులు అత్యాధునిక ఆయుధాలతో కాల్పులు జరిపారన్నారు. పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో పోలీసులపై మావోయిస్టులు కాల్పులు జరిపారని.. పోలీసుల కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మరణించారని చెప్పారు. హైకోర్టు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచనల మేరకే శవ పరీక్షలు నిర్వహించామని.. ఎన్‌కౌంటర్ కేసు దర్యాప్తు అధికారిగా వేరే జిల్లా డీఎస్పీని నియమించినట్లుగా వివరించారు. అయితే, ఆదివారం తెల్లవారు జామున ములుగు జిల్లా ఏటూరునాగా రంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా మావో సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నర్సంపేట-ఇల్లందు ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, ఏటూరునాగారం-మహాదేవ్‌పూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు సైతం ఉన్నారు. మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా రాణాపూర్ కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ జిల్లాకు చెందిన వారే. పీఎల్‌జీఏ వారోత్సవాల సందర్భంగా ఛత్తీస్‌గఢ్ -తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం ప్రాంతంలో గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం 6.16 గంటల ప్రాంతంలో చెల్పాక-ఐలాపూర్ అభయారణ్యం లోని పోలకమ్మవాగు సమీపంలో మావోలు, బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. దాదాపు అరగంటకుపైగా కాల్పులు జరిగినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. ఆ తర్వాత సంఘటనా స్థలంలో ఏడుగురు మావోల మృతదేహాలను గుర్తించారు. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులు, 303 రైఫిల్, ఇన్సాస్ తుపాకీ, ఎస్‌బీబీఎల్ గన్, సింగిల్‌షాట్ తుపాకీ, తపంచా, కిట్‌బ్యాగులు, విప్లవ సాహిత్యం తదితర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పిటిషన్ పౌరహక్కుల సంఘం నేతలు లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఏడుగురు మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరుల హక్కుల సంఘం నేతలు ఆరోపించారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి కస్టడీలోకి తీసుకున్నారని.. ఆ తర్వాత చిత్రహింసలకు గురి చేసి ఎన్‌కౌంటర్ చేసినట్లు పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్రమైన గాయాలు ఉన్నాయని..మృతదేహాలను కుటుంబీకులకు చూపకు ండా పోస్టుమార్టానికి తరలించారని చెప్పారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించినట్లుగా ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని.. వైద్య నిపుణుల సమక్షంలో పోస్టుమార్టం చేయడంతో పాటు వీడియో రికార్డింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ పాలన చూసి బీజేపీ ఓర్వలేక పోతుంది..



**శాసనసభ / హైదరాబాద్ :** కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి జీవన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఏడాది ఉత్సవాలను చేస్తుంటే.. కాంగ్రెస్ పాలన చూసి బీజేపీ ఓర్వలేక పోతుందని విమర్శించారు.బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా ఉచిత బస్ రవాణా ఇస్తున్నారా?.. రైతు రుణాలు మాఫీ చేశారా?.. ఎంఎస్పీ ఇవ్వాల్సిన మీరు.. చట్టబద్దత కల్పించడం లేదు అని ప్రశ్నించారు. కానీ మేము వరి బోనస్ ఇచ్చి కొంటున్నామన్నారు. బీజేపీ వాళ్లు కూడా మమ్మల్ని ఏం చేస్తున్నారు అని అడుగుతుంటే విచిత్రం అనిపిస్తుంది.. కోటి కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. ఐదు వందల రూపాయలకే గ్యాస్ ఇస్తున్నామని జీవన్ రెడ్డి చెప్పుకొచ్చారు.ఇక, మా మీద చార్జిషీట్ కాదు.. బీజేపీ వాళ్లు ఇచ్చిన హామీలపై ప్రాసిక్యూట్ చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ నేతలు మమ్మల్ని విమర్శించే కంటే ముందు మీరు ఆత్మ విమర్శ చేసుకోండి అని తెలిపారు. 20 వేల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేసింది వాస్తవం కదా..? హరీష్ రావు.. మీరు చేసింది ఎంత..? అని అడిగారు. నువ్వు చేసిన మాఫీ వడ్డీకే సరిపోయింది.. సన్న రకాల వడ్లకు బోనస్ ఇస్తుంది.. బోనస్ ఇవ్వడం వల్ల రైతులకు మరింత ఎక్కువ ధర లభిస్తుంది అని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సంబరాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని వెల్లడి



**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ విమర్శనాస్త్రాలు సంధిస్తోంది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ గ్యారెంటీలపై బీజేపీ తాజాగా చార్జిషీట్ విడుదల చేసింది."కాంగ్రెస్ గ్యారెంటీల గారడీ: 6 అబద్ధాలు, 66 మోసాలు" పేరుతో ఈ చార్జిషీట్ రూపొందించారు. దీనిపై తెలంగాణ బీజేపీ చీఫ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. 100 రోజుల్లో గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన ఏ హామీని ఈ ఏడాది కాలంలో నెరవేర్చలేదని అన్నారు.కాంగ్రెస్ పాలనపై ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదని కిషన్ రెడ్డి తెలిపారు. ఏమీ చేయకుండానే, కాంగ్రెస్ జరుపుకుంటున్న విజయోత్సవాలు చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారని వ్యాఖ్యానించారు. విజయోత్సవాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా సంబరాలు చేసుకోవడమేంటని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

## రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం...

### లారీ దూసుకొచ్చి, ఆరుగురు మృతి

రంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తెలంగాణలోని చేవెళ్ల మండలం ఆలూరు స్టేజీ వద్ద ఓ లారీ బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్-బీజాపూర్ రోడ్డు పక్కన దాదాపు 50 మంది కూరగాయలు విక్రయిస్తుండగా లారీ వారి మీదకు దూసుకెళ్లింది. లారీ తమ వైపుకు దూసుకు రావడం చూసిన కూరగాయల విక్రయదారులు అక్కడి నుంచి పరుగు పెట్టారు.అయితే వేగంగా వచ్చిన లారీ పలువురు పైనుంచి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఓ చెట్టును ఢీకొట్టి నిలిచిపోయింది. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. లారీ ఎంత వేగంతో వస్తుందంటే... ఆ వేగానికి అది ఢీకొట్టిన చెట్టు కూడా కూలిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని చేవెళ్ల ఆసుపత్రికి తరలించారు. దాదాపు వంద మీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గుర్తించిన కూరగాయల వ్యాపారులు పరుగు పెట్టారు. కానీ కొంతమంది మృత్యువాత పడ్డారు.**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి :** ఆలూరు స్టేజ్ వద్ద జరిగిన ఘోర ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడినవారికి మెరుగైన వైద్య సదుపాయం అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## సీఎం అభ్యర్థి పేరు ప్రకటన మళ్లీ వాయిదా? ఎందుకో..!

కొత్త ప్రభుత్వం ఏర్పడడానికి కూడా మహాయుతి కూటమికి భారీ విజయం కూడా ఉంది. కానీ సీఎం పేరు అధికారికంగా ప్రకటించడానికి జంకుతున్నారు. భవిష్యత్ ముప్పును దృష్టిలో పెట్టుకుని ఏం జరగుతుందోనన్న ఆందోళనతోనే పేరు ప్రకటించేందుకు బీజేపీ హైకమాండ్ భయపడుతుందని వార్తలు వినిపిస్తున్నాయి.సోమవారం సీఎం అభ్యర్థి పేరు ప్రకటిస్తారని వార్తలు వచ్చాయి. అయితే షిండేకు అనారోగ్యం కారణంగా ముంబైలో జరగాల్సిన ఎన్డీఏ సమావేశం రద్దైంది. దీంతో సీఎం అభ్యర్థి పేరు ప్రకటన మళ్లీ వాయిదా పడింది. మరోవైపు మహారాష్ట్ర పంచాయితీ పరిష్కారం కోసం కేంద్ర పరిశీలకులుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, గుజారాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ నియమింపబడ్డారు. ఇంకోవైపు డిసెంబర్ 5నే మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం ఉంటుందని బీజేపీ ప్రకటించింది. కానీ ఇప్పటి వరకు మాత్రం పేరు ప్రకటించలేదు. తాజాగా డిసెంబర్ 4న ప్రకటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రమాణస్వీకారానికి ఒకరోజు ముందు పేరు ప్రకటిస్తారని బీజేపీ నేత ఒకరు మీడియాకు వెల్లడించారు. దీంతో మరికొన్ని గంటల పాటు సస్పెన్స్ కొనసాగనుంది. డిసెంబర్ 4వ తేదీ ఉదయం 10 గంటలకు మహారాష్ట్ర విధాన్ భవన్‌లో బీజేపీ శాసనసభా పక్షం సమావేశం కానుందిఇదిలా ఉంటే మళ్లీ తానే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని షిండే సన్నిహితుల దగ్గర అన్నారని సమాచారం. సామాన్యుడిగా ప్రజల సమస్యలు, బాధలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసినట్లు షిండే చెప్పుకొచ్చారు. అందుకోసం తిరిగి రావాలని ప్రజలు భావిస్తున్నారని షిండే చెప్పుకొచ్చినట్లు సమాచారం.

## భారత్‌లో పర్యటించండి.. పుతిన్‌కి మోడీ ఆహ్వానం..

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ని భారత్‌లో పర్యటించాల్సిందిగా ప్రధాని నరేంద్రమోడీ ఆహ్వానించినట్లుగా ఆ దేశం ప్రకటించింది. 2025లో ఈ పర్యటనకు సంబంధించిన తేదీలను నిర్ణయించనున్నట్లుగా క్రెమ్లిన్ సహాయకుడు యూరీ ఉసాకోవ్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ.. పుతిన్, పీఎం మోడీ ఏడాదికి ఒకసారి సమావేశాలు నిర్వహించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారని, ఈ సారి రష్యా వంతు అని భారతదేశంలోని రష్యా రాయబార కార్యాలయం తెలిపింది. "మా నాయకులు ఏడాదికి ఒకసారి సమావేశాలు నిర్వహించాలని ఒప్పందం ఉంది. ఈసారి ఇది మా వంతు", ప్రధాని నరేంద్రమోడీ ఆహ్వానాన్ని అందుకున్నాము, మేమే దానిని ఖచ్చితంగా సానుకూలంగా పరిశీలిస్తాము అని ఆయన వెల్లడించారు.2025 ప్రారంభంలో తేదీలు కనుగొంటామని అన్నారు. 2022లో ఉక్రెయిన్, రష్యా మధ్య వివాదం ప్రారంభమైన తర్వాత పుతిన్ భారత్‌లో తొలిసారి పర్యటించబోతున్నారు. ఉక్రెయిన్ వివాదాన్ని పరిష్కరించడానికి భారత్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని ఇటీవల రష్యా పర్యటనలో ప్రధాని మోడీ అన్నారు. శాంతి, దౌత్యమార్గాల్లో సమస్యను ఇరు దేశాలు పరిష్కరించుకోవాలని సూచించారు.ఈ ఏడాది, రష్యా-భారత్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు జూలైలో మోడీ మాస్కో వెళ్లారు. ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాల గురించి చర్చించారు. భారతదేశం-రష్యా సంబంధాలను పెంపొందించడంలో చేసిన కృషికి గానూ ప్రధాని మోదీకి రష్యా అత్యున్నత జాతీయ పురస్కారం "ది ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్" కూడా లభించింది. అక్టోబర్ నెలలో బ్రిక్స్ సమావేశంలో కోసం మరోసారి మోడీ రష్యాలోని కజాన్‌కి వెళ్లారు. పుతిన్, మోడీల మధ్య మరోసారి సమావేశం జరిగింది.

## 'మహాలక్ష్మి స్కీమ్ కాదు మహా ధోకా'.. రఘునందన్ రావు ట్వీట్



**శాసనసభ / హైదరాబాద్ :**మహాలక్ష్మి స్కీమ్ కాదు మహా ధోకా అని బీజేపీ నేత, ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. '6 దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో మహిళలకు జరిగింది అన్యాయమే. రైతు భరోసా కాదు రైతులకు అరిగోస.ఆనాటి నుంచి నేటి వరకు అదే గోస. గృహజ్యోతి.. ఆరు పదుల చీకట్లకు సాక్ష్యం. ఇప్పటికీ అబద్ధాలతో నిర్లక్ష్యం చేస్తున్నరు.ఇప్పటికీ గూడు కరువైన పేదలు ఉన్నారంటే.. ఆరు పదుల కాంగ్రెస్ పాలన శాపమే అది. ఇండ్లు కాదు.. అవి పేదలకు కడగండ్లు' అని ట్వీట్ చేశారు.

## మా తలరాతలు మార్చిన మీరే ఈ ప్రభుత్వాన్ని కూడా కాపాడుకోవాలి!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలే అవుతోందని, ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా? అయినా ఈ కాలంలో మనం చేయాల్సింది చేశామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మీరు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు.ఈ ప్రభుత్వం కష్టం మీద వచ్చిందని చెప్పడం లేదని, కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించడం ద్వారా మా తలరాతను మార్చి పెద్ద బాధ్యతలు ఇచ్చారని, కాబట్టి విషప్రచారాన్ని కూడా తిప్పికొట్టే బాధ్యత మీదే అన్నారు. నల్లచట్టాలు తెచ్చిన మోదీ, వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.**213 అంబులెన్స్‌లు ప్రారంభం :** ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల హెచ్ఎండీఏ మైదానంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ప్రజాపాలన వేడుకల్లో భాగంగా 213 అంబులెన్స్‌లను ప్రారంభించారు. 108, 102 వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత విద్య, వైద్యం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ రెండింటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏడాదిలోపు తమ ప్రభుత్వం వైద్యశాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. వైద్య శాఖ బలోపేతమైతేనే ఆరోగ్య తెలంగాణ నిర్మాణమవుతుందన్నారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున వైద్య శాఖలో ఎవరూ భర్తీ చేయలేదన్నారు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.**తెలంగాణ సమాజమే మా కుటుంబం :** తెలంగాణ సమాజమే తమ కుటుంబం అనుకొని తాము ఉద్యోగాలు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ ఎనిమిది మెడికల్ కాలేజీలను ఇచ్చి కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఉద్యోగాలు ఊడితేనే యువతకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పరీక్షలు వాయిదా వేయమని చాలామంది డిమాండ్ చేశారని, కానీ విద్యార్థుల విలువైన సమయం వృథా అవుతుందని అలా చేయలేదన్నారు. కానీ గత ప్రభుత్వం పలుమార్లు వాయిదా వేసిందన్నారు.గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని... తాము మాత్రం పంటలు వేసేలా ప్రోత్సహించామన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడుతుంటే కొంతమందికి భయం పట్టుకుందన్నారు. సంక్రాంతికి ముందు గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు కొంతమంది వస్తారని, కానీ వారు వచ్చేది పంచాయతీ ఎన్నికల కోసమే అన్నారు.**మేం పని మీద దృష్టి సారించాం :** సీఎంగా తన పనిని ఆపి పక్కన పెడితే... అభివృద్ధి ఆగిపోతుందన్నారు. అందుకే తాను పని మీద దృష్టి సారించానన్నారు. మీరు (కార్యకర్తలు, ప్రజలు) భుజాలపై మోస్తేనే తాము అధికారంలో కూర్చున్నామన్నారు. మాకు కుర్చీ రావడానికి కారణం ఈ ప్రజలు, కార్యకర్తలే అన్నారు. కాబట్టి ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదే అన్నారు. అందుకే ప్రతిపక్షం చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే బాధ్యత కూడా మీదేనని సభకు వచ్చిన వారిని ఉద్దేశించి అన్నారు.

## గత పదేళ్ళు ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి గురైంది..

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు , పేదవారికి, మధ్యతరగతి లో గానీ ఆయా కుటుంబాల్లో ఆరోగ్యం విషమిసే.ఆర్థికంగా పెట్టుకోలేక అనేక ఇబ్బందులు పడ్డారని, అందుకే రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం లో 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామన్నారు భట్టి విక్రమార్క. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు, సదుపాయా ల కల్పన విషయంలో పూర్తి స్థాయిలో మేము అందించే ప్రయత్నం చేస్తున్నామని, గత పదేళ్ళు ఆరోగ్య శాఖ నిర్లక్ష్యానికి గురైందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్ళారు.. ఇప్పుడు వాటికి అతికష్టం మీద వడ్డీలు కడుతున్నామన్నారు.కాకినాడ పోర్టులో పట్టుపడిన రేషన్ బియ్యం..మంత్రి నాదెండ్ల కీలక వ్యాఖ్యలు అంతేకాకుండా..'సంవత్సరం కూడా అధికారం లేకపోతే ఉండలేక పోతున్నారు.. సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.BRS వారు ఆరు గ్యారెంటీలు అమలు పై గోల చేస్తున్నారు. 21 వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ కోసం కేటాయించాం.. 55వేల మందికి ఉద్యోగాలు ఇచ్చాం.. 200 యూనిట్స్ కి ఉచిత విద్యుత్ ఇస్తున్నాం.. మహాలక్ష్మి పథకం..అమలు చేస్తూ కోట్లాది మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తున్నాం.. పదేళ్ళు మీరు హాస్టల్స్ లో ఉండే విద్యార్థులకు ఒక్క రూపాయి కూడా పెంచలేదు. మేము 40 శాతం డైట్ చార్జీలు పెంచాం.. 5 వేల కోట్ల రూపాయలతో 30 ఇంటిగ్రేటెడ్ గురుకులాలు నిర్మిస్తున్నాం.. పరిశ్రమలు తీసుకొచ్చి విశ్వ నగరంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం.. అలాగే వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు 6 వేల కోట్ల రూపాయలు వెచ్చించేందుకు పునాదులను రాష్ట్ర క్యాబినెట్ వేసింది.. ఇన్ని చేస్తుంటే ప్రతిపక్ష BRS, BJP లు ప్రజలని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయి.. అలా రెచ్చగొడితే కాంగ్రెస్ పార్టీ ఊరుకోదు.. విద్యా, వైద్యం మా మొదటి ప్రాధాన్యత. నిధులు కేటాయిస్తాం..' అని భట్టి విక్రమార్క అన్నారు.

## సరికొత్తగా తెలంగాణ తల్లి విగ్రహం తయారీ..

తెలంగాణ సచివాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతిష్టించబోతున్న తెలంగాణ తల్లి విగ్రహం హైదరాబాద్ నగర శివార్లలలో రేడి అవుతోంది. దీన్ని అత్యంత గోప్యంగా డిజైన్ చేపిస్తోంది..పెద్ద అంబర్ పేట గండి చేరువు దగ్గరలోని ఓ శిల్పి దీన్ని తయారు చేస్తున్నారు..తెలంగాణ సచివాలయం ముందు దీని కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. డిసెంబర్ 9 న ఆవిష్కరించడానికి రేడి అవుతున్నారు.. దీనిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు సీఎంఈ ఏడాది ఫిబ్రవరి 4న కేబిటనేట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వం చేసిన ప్రకటన. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

**తెలంగాణ పల్లె తనం ఉట్టిపడేలా విగ్రహం –** ప్రస్తుతం ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కొత్తగా రూపొందిస్తున్న తెలంగాణ తల్లి విగ్రహంపై స్పెషల్ గా ఫోకస్ చేస్తుంది సర్కార్.. దీని కోసం స్వయంగా శిల్పులతో రేవంత్ సమావేశాలు నిర్వహించారు. దాని తర్వాత డిజైన్ ను ఫైనల్ చేశారు.. సగటు తెలంగాణ మహిళ రూపంలో తెలంగాణ తల్లి ఉండనున్నట్లుగా విగ్రహానికి సంబంధించి అన్ని భాధ్యతలు చూస్తున్న ఓ మంత్రి టివి9 తెలుగు తో వివరాలు వెల్లడించారు. తెలంగాణ వ్యవసాయం, బతుకమ్మ, శ్రమ జీవనం, పోరాటం, ఇలా అన్ని సందేశాలు ఇచ్చే విధంగా తెలంగాణ తల్లి విగ్రహన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీని కోసం ఇప్పటికే సీఎం రెండు మూడు సార్లు ఏవరికీ చేప్పకుండా విగ్రహం తయారు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించినట్లు చెప్పారు.విదేశాల్లో మాదిరి పౌంటైన్ ఇక తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయబోయే ప్రదేశంలో పెద్ద ఫౌంటైన్‌ను, రాత్రికాగానే లేజర్ ఫౌంటైన్ ను ఏర్పాటు చేయనున్నారు. దీన్ని ట్యాంక్ బండ్ పైకి, ఎన్టీఆర్ మార్గ్ లోకి వచ్చే సందర్శకులకు సైతం అనుమతి ఇవ్వనున్నారు.. ఇప్పుడు పెట్టబోయే విగ్రహం కోసం సాదరణ సందర్శకుల కోసం ప్రత్యేక గేటును కూడ ఏర్పాటు చేయనున్నారు. అయితే.. ప్రస్తుతం సర్కార్ ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తుంది.. డిసెంబర్ 9వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి..డిసెంబరు 9వ తేదీన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా.. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. సోనియా గాంధీ జన్మదినంతో పాటు ప్రజా పాలన ఏడాది విజయోత్సవాలను ఘనంగా నిర్వహించేలా రేవంత్ రెడ్డి సర్కార్ ప్లాన్ చేసింది.

( మొదటి పేజీ తరువాయి )

## ఈ నెల 7న ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జిషీట్ వేస్తామన్న హరీశ్ రావు

రెండు వైపుల పదును కలిగిన కత్తితో కూడా జాగ్రత్తగా ఉండవచ్చు... కానీ ఈ డబుల్ టంగ్ లీడర్లతో మాత్రం చాలా ప్రమాదకరమన్నారు. సమాజానికి చాలా నష్టం చేస్తారని మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా మాట్లాడారు... అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఎలా మాట్లాడుతున్నారో... ఆ రెండు నాల్కల ధోరణి ఏమిటో వెల్లడిస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక రేవంత్ మాట తీరులో మార్పు వచ్చిందని ఆరోపించారు. ఈ నెల ఏడో తేదీన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జీషీటు వేస్తామని తెలిపారు. సీఎం అయ్యాక కూడా ఆయన మాట మార్చిన తీరును అందరూ గమనిస్తూనే ఉన్నారన్నారు.రెండు నాల్కల ధోరణిలో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారని ఎద్దేవా చేశారు. మాట మార్చడంలో, పూటకో మాట మాట్లాడడంలో రేవంత్ రెడ్డి దిట్ట అన్నారు. ఆ మాట అనలేదు... ఈ మాట అనలేదంటూ ముచ్చటగా మూడో మాట చెప్పగల నేర్పరితనం కూడా రేవంత్ రెడ్డిలో ఉందని ఎద్దేవా చేశారు. ఓ పార్టీలో ఉంటూ మరో పార్టీ అగ్రనాయకులను రాక్షసులు అంటారని, ఆ తర్వాత అదే పార్టీలో చేరి రాక్షసులు అన్న నోటితోనే దేవతలు అంటారని వ్యాఖ్యానించారు. సిగ్గు, ఎగ్గు లేకుండా మాట్లాడటం రేవంత్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు.రైతు బంధు, రైతు బీమా ఇచ్చింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమే అన్నారు. కానీ కాంగ్రెస్ వీటిని పక్కన పెట్టిందని విమర్శించారు. ఎల్ఆర్ఎస్ విషయంలో గతంలో తమ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారన్నారు.

## కేసీఆర్ ను రేవంత్ 'కలుపు మొక్క' అనడంపై కవిత స్పందన

తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను సీఎం రేవంత్ రెడ్డి కలుపు మొక్క అని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. పీకేయడానికి కేసీఆర్ అంటే ఒక మొక్క కాదని... కేసీఆర్ ఒక వేగుచుక్క అని పేర్కొన్నారు. తెలంగాణను సాధించిన శక్తి కేసీఆర్ అని కొనియాడారు. కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పాల్గొన్నారు.బీఆర్ఎస్ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తే చూస్తూ ఊరుకోబోమని కవిత హెచ్చరించారు. ముఖ్యమంత్రి, మంత్రులు తిట్లతోనే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో నిధులు వరదలై పారేవని... ఇప్పుడు తిట్లు పారుతున్నాయని మండిపడ్డారు. రైతుబంధును శాశ్వతంగా తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

## పేదవాని వైద్యం, విద్య మా బాధ్యతగా భావించేది. కాంగ్రెస్ పార్టీ..

రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం 5లక్షల నుంచి 10 లక్షల కు పెంచామని, 1,375 ప్రోసీజర్లకు ధరలను 22శాతం కి పెంచామని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్యం సబ్ సెంటర్లు,PHC,ఏరియా హాస్పిటల్స్,మెడికల్ కాలేజీలు,నర్సింగ్ కాలేజీలకు . 500 కోట్ల రూపాయలు విడుదల చేసిన చరిత్ర కాంగ్రెస్ దే అని ఆయన అన్నారు.2 వేల కోట్ల రూపాయలు లతో కొత్త ఉస్మానియా దవాఖానా కు శంకుస్థాపన చేసుకోబోతున్నామని, క్యాన్సర్, డయాబెటీస్, బీపీ, వంటి దీర్ఘకాలిక వ్యాధులను కట్టడి చేసేందుకు ఆయా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు దామోదర రాజనర్సింహ. అంతేకాకుండా..గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీలకు హాస్టల్స్ కి శంకుస్థాపన చేసుకున్నామని ఆయన తెలిపారు. పేదవారికి వైద్యం కోసం అప్పులపాలు కావొద్దు అనేది మా లక్ష్యం అని ఆయన అన్నారు. ఇవ్వాళ ప్రారంభించిన 213 అంబులెన్స్ లతో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైం. 20 నిమిషాల నుంచి 13 నిమిషాలకు చేరుకుందని, 80 ట్రామ సెంటర్లు ఏర్పాటుకు సిద్ధం అవుతున్నామని ఆయన వెల్లడించారు.

## సుప్రీంకోర్టు కోర్టు ఆదేశాలతో ఎస్సీ వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నాం.

సుప్రీంకోర్టు కోర్ట్ ఆదేశాలతో ఎస్సీ వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన తెలిపారు. 2700 కోట్లతో రైతు రుణమాఫీ కి ఇవ్వడం జరిగిందని, 850కోట్లు రైతుల మీద వడ్డీ భారం పడిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ ఔటర్ రింగ్ రోడ్డు అమ్మేసి 1700 కోట్లు సొమ్ము చేసుకుందని, పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు.అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కాకముందే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన ఉద్ఘాటించారు. 40 లక్షల మంది రైతులు 153 లక్ష మెట్రిక్ టన్ను పంట పండించారని, పొల్యూషన్ నివారణకు ఎలక్ట్రికల్ బస్సు కొనుగోలు చేసిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని, అత్యధిక పరిశ్రమలు నిర్మిస్తున్నామని, ఈనెల నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## రైతులకు లాభాలు తెచ్చిపెట్టే పంట ఆయిల్పామ్

ఖమ్మం జిల్లాని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా కృషి చేస్తున్నామన్నారు.తన చిరకాల కోరిక సీతారామ ప్రాజెక్ట్తో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడమన్నారు. వచ్చే ఆగస్టు 15 నాటికి సీతారామ ప్రాజెక్ట్తో సాగు నీళ్ళు అందిస్తామని చెప్పారు. రఘునాథపాలెం మండలంలో రూ.66 కోట్లతో మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సంక్రాంతి నాటికి శంకుస్థాపన చేస్తామన్నారు. ఇప్పటికే జాతీయ రహదారులు ఏర్పాటుతో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రగతి బాట పట్టిందన్నారు.ఉద్యాన పంటల సాగుతో రైతాంగానికి మేలు జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఏడో తేదీన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. విద్యా రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన స్వామి నారాయణ ట్రస్ట్, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల ఏర్పాటుకు క్యాబినెట్ అనుమతి తెలిపిందని అన్నారు.ఖమ్మం ఎమ్మెల్యేగా క్యాబినెట్లో ఉండే అవకాశం ఖమ్మం ప్రజానీకం ఆశీర్వాదంతో తనకు దక్కిందన్నారు. అరాచకం, అక్రమాలు లేని ప్రశాంతమైన ఖమ్మం కోసం ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. ప్రజా పాలనలో ప్రజలు కోరినట్టు ఖమ్మం ప్రగతి బాటలు వేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, జడ్పీ సీఈవో దీక్ష రైనా, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, మానుకొండ రాధా కిషోర్, సాధు రమేష్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యార్థుల సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న నాయకులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటు.


**- డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,మాజీ బీసీ సభ్యులు ఆంజనేయులు గౌడ్,ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఇతర నాయకుల పై పెట్టిన కేసు వెనక్కి తీసుకోవాలి.**

**- విలేకరుల సమావేశంలో బి ఆర్ ఎస్ వి నియోజకవర్గం అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్.**

ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 2 : డిసెంబర్ 7 నుచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్వీ "గురుకులాల బాట" కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఉన్న ప్రతి హాస్టలను సందర్శిస్తామని బి ఆర్ ఎస్ వి నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ అన్నారు.గురుకులాలు,ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను గుర్తించి, బీఆర్ఎస్వీ సిద్ధం చేసే నివేదికను అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ లేవనెత్తుతుందన్నారు.కాంగ్రెస్ వచ్చిన సంవత్సరం నుండి తెలంగాణలో విద్యా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు లేరని, నిర్వహణ సరిగ్గా లేక రాష్టంలో గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చనిపోతున్నారని అన్నారు.కేసీఆర్ హయాంలో గురుకుల విద్యావ్యవస్థ ఆదర్శంగా నిలిచిందన్నారు.ఒకే జిల్లాలో మూడు సార్లు గురుకుల విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురికావడం నిర్వహణ లోపమేనన్నారు.రాష్ట్రము లో 28 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న విషయం విధితమే అన్నారు.గురుకులాల్లో పని చేస్తున్న టీచర్లకు ఆరు నెలల నుండి జీతాలు రాకపోవడం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో డిసెంబర్ 7 నుంచి గురుకులాల్లో ఉన్న సమస్యలపై అధ్యయనం చేసి నివేదిక ఇస్తామన్నారు.గురుకుల బాట పిలుపుతో కాంగ్రెస్ పార్టీకి భయం పుట్టిందని, సీఎం రేవంత్ రెడ్డికి విద్యాశాఖపై అవగాహన లేదని, పోలీస్ యూనిఫార్మ్ పక్కన పెట్టి గురుకులాల సెక్రటరీగా తొమ్మిది సంవత్సరాలు పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పై అక్రమ కేసు పెట్టడం సిగ్గుచేటని ఆరోపించారు. గురుకులాలపై రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు శ్రద్ధ లేదని ఆరు నెలల నుండి విద్యార్థులకు కాస్మొటిక్ ఛార్జీలు లేవని పలు సమస్యలను సమావేశంలో మాట్లాడారు .ఈకార్యక్రమంలో నియోజకవర్గం బి ఆర్ ఎస్ వి నాయకులు ఏర్పుల అశోక్ బి.కుమార్,అమంచ రంజిత్,రవి గౌడ్, దేరంగుల భాను,ధర్మ నాయక్,అరుణ్,జి మణి కంఠ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం ఎన్‌కౌంటర్.. మృతదేహాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశం

శాసనసభ / హైదరాబాద్ : ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయని, కనీసం కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని కోర్టుకు వివరించారు. ఎన్‌హెచ్ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించినట్లు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన



వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత రేపటి వరకు మృతదేహాలను భద్రపర్చాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు,బంధువులకు చూపించాలని ఆదేశిస్తూ..తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# శేరిలింగంపల్లి లొ ఫర్నిచర్ షాప్ లో అగ్ని ప్రమాదం..

శాసనసభ / హైదరాబాద్ : చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి గుల్మోహర్ పార్క్ సిగ్నల్ వద్ద గల సోఫా తయారీ షాపులో ఆదివారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.గుల్మోహర్ పార్క్ సిగ్నల్ వద్ద మహావీర్ సోఫా వర్క్స్, మస్కిటో డోర్స్ షాప్ చాలాకాలంగా నిర్వహిస్తున్నారు. ఈ షాపులో అర్ధరాత్రి వేళ ఒక్కసారిగా మంటలు చెలరేగి షాప్ పూర్తిగా దగ్ధం అయింది. అర్ధరాత్రి వేళ ప్రమాదం చోటుచేసుకోవడంతో భారీ ప్రమాదం తప్పింది. షాపులోని సోఫాలు, ఇతర సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది.సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. సమీపంలోని ఇళ్లకు, షాపులకు మంటలు అంటుకోకుండా అడ్డుకున్నారు. ఈ ప్రమాదంలో



భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు షాప్ యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాద ఘటనకు షార్ట్ సర్క్యూట్ కారణం అయి ఉండవచ్చని అగ్నిమాపక సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# శబరిమలలో భారీవర్షాలు.. ఆ ప్రదేశాలలో నిషేధం.. అయ్యప్ప భక్తులకు కీలక అలెర్ట్!

శాసనసభ / హైదరాబాద్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో మాత్రమే కాకుండా దీని ప్రభావం కేరళ రాష్ట్రం పైన కూడా పడుతుంది.కేరళ రాష్ట్రంలోనూ శనివారం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. పతనం తిట్ట జిల్లాలో నిన్నటి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో శబరిమల కు వెళుతున్న అయ్యప్ప భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

**వర్షాలతో శబరిమల వద్ద అధికారులు అలెర్ట్**

దేశం నలుమూలల నుంచి మండల దీక్షలో భాగంగా శబరిమలకు వెళ్లిన అయ్యప్ప భక్తులు వర్షాలతో ఇబ్బంది పడుతున్న వేళ ట్రావెన్ కోర్ దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల సౌకర్యార్థం వసతులను కల్పించి జాగ్రత్తలు తీసుకుంటుంది. మరోవైపు పతనం తిట్ట కలెక్టర్ కూడా వర్షాల నేపథ్యంలో కీలక ఆదేశాలు ఇచ్చారు. వర్షాల కారణంగా ఒకవైపు పంపానదిలో ప్రవాహం కూడా పెరిగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ప్రమాదాలను నివారించడానికి చర్యలు చేపట్టారు.

**ప్రమాదకర ప్రదేశాలకు వెళ్ళకుండా నిషేధం**

ఎన్ డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక, రాపిడ్ యాక్షన్ టీం, పోలీసు సిబ్బంది వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, భక్తులను ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. శబరిమల కొండల్లో కొండ చరియలు విరిగిపడే ప్రాంతాలలో నదులు, అడవులు ఉన్న ప్రాంతాలలో భక్తులను అనుమతించరాదని ఆదేశాలు జారీ చేశారు. అంతే కాదు పంబానది వద్ద ప్రవాహం ఎక్కువగా ఉన్న కారణంగా ఘాట్ల వద్ద స్నానానికి దిగకూడదని కూడా సూచనలు చేశారు పతనం తిట్టా కలెక్టర్.



**ఫ్లాష్ ఫ్లడ్స్, కొండ చరియలు విరిగిపడే అవకాశంతో అలెర్ట్**

వర్షాలు తగ్గి నది ప్రవాహం తగ్గి సాధారణ స్థితి వచ్చేవరకు ఈ ఆదేశాలు అమలు అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. తీవ్రమైన వర్షాలు పడితే ఒక్కోసారి ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉంటుందని, కొండ చరియలు విరిగిపడడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, కనుక ప్రమాదకర ప్రాంతాలకు భక్తులు సందర్శకులు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

**ఆ అటవీ మార్గం గుండా ప్రయాణం నిషేధం**

వర్షాల కారణంగా నీరు ఎక్కువైనపుడు రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, అందుకే నదులు దాటడాన్ని లేదా స్నానాలు చేయడానికి ప్రయత్నాలు చేయడాన్ని నివారించాలన్నారు. మరోవైపు ఇడుక్కి జిల్లాలో ముక్కు జి సత్రం అటవీ మార్గం గుండా ప్రయాణాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు పోలీసులు, అటవీ శాఖ అధికారులు కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తంగా వర్షాలతో తడిసి ముద్దవుతున్న శబరిమల లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

# నన్ను కాల్చి చంపినా వారి తరఫునే మాట్లాడుతాను: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**- సీఎం తన సైకో రౌడీ కుట్రలను బంద్ చేయాలన్న బీఆర్ఎస్ నేత**

**- గురుకులాల్లో టాయిలెట్లు బాగా లేవని,కుళ్లిన కూరగాయలతో భోజనం పెడుతున్నారని ఆగ్రహం**

**- విద్యార్థులకు మంచి టీచర్లను పెట్టకుంటే ఎలా అని నిలదీత**



శాసనసభ / హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై ఎన్ని కేసులు పెట్టినా... చివరకు తనను కాల్చి చంపినా కూడా పేదల పక్షానే మాట్లాడుతానని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సీఎం తన సైకో రౌడీ కుట్రలను బంద్ చేసి పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన తీవ్రంగా స్పందించారు.గురుకులాల్లో టాయిలెట్లు బాగా లేవని, కుళ్లిన కూరగాయలతో పిల్లలకు భోజనం పెడుతున్నారని, యూనిఫామ్స్ లేకుండా, బెడ్లు, బూట్లు లేకుండా విద్యార్థులు ఎలా చదువుకోగలరని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే తమ బంగ్లాల నుంచి బయటకు వచ్చి గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చూడాలన్నారు.ప్రతిభావంతులైన విద్యార్థులను పరీక్షల ద్వారా ఎంపిక చేసి... వారికి సరైన ఉపాధ్యాయులను ఇవ్వకుంటే ఎలా? అన్నారు. ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో కూడా పిల్లలు ఇంగ్లీష్ మాట్లాడలేని పరిస్థితి ఉందని విమర్శించారు. తనను ఏం చేసినా తాను మాత్రం నోరు లేని పేద బిడ్డల పక్షాన నిలబడతానన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మతిస్థిమితం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, మరెందరో చిల్లరమూకలు తనపై దాడి చేస్తున్నారని, కానీ తాను బెదిరే వ్యక్తిని కాదన్నారు. పోలీసులతో అడ్డుకున్నంత మాత్రాన తమ గురుకుల బాట కార్యక్రమం ఆగదన్నారు. గురుకులాల్లోని వాస్తవాలను ఎందుకు దాచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రైతుల 'ఛలో ఢిల్లీ'... ఢిల్లీ వెలుపలే అడ్డుకున్న పోలీసులు

**- పంటలకు మద్దతు ధర పెంచాలంటూ పంజాబ్ రైతుల డిమాండ్**

**- 'ఛలో ఢిల్లీ'కి కదం తొక్కిన రైతులు**

**- నోయిడా వద్ద అడ్డుకున్న పోలీసులు**

**- రైతుల ఆందోళనతో ఢిల్లీ-నోయిడా రహదారిపై నిలిచిన రాకపోకలు**



శాసనసభ / హైదరాబాద్ : పంటలకు మద్దతు ధర పెంచాలంటూ పంజాబ్ రైతులు నేడు 'ఛలో ఢిల్లీ' కార్యాచరణకు కదం తొక్కారు. అయితే, నోయిడాలోని దళిత్ ప్రేరణ్ స్థల్ వద్ద పంజాబ్ రైతులను పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వందలాది రైతులు ముందుకు రాకుండా పోలీసులు నిలువరించారు.అయినప్పటికీ బారికేడ్లు తొలగించి ఢిల్లీ వైపు దూసుకెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. రైతుల ఛలో ఢిల్లీ నేపథ్యంలో మూడంచెల భద్రత చర్యలు అమలు చేసిన పోలీసులు... రైతులు ముందుకు సాగకుండా ఆపేశారు. పోలీసులు భారీగా వాటర్ క్యానన్లు, టియర్ గ్యాస్ షెల్స్ సిద్ధంగా ఉంచారు. అదనపు బలగాలను మోహరించి, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేశారు. రైతుల ఆందోళన కారణంగా ఢిల్లీ-నోయిడా రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

# పార్లమెంట్‌లో 'ది సబర్మతి రిపోర్ట్' మూవీ చూసిన మోడీ

శాసనసభ / న్యూఢిల్లీ : ప్రధాని మోడీ సోమవారం పార్లమెంట్‌లోని బాలయోగి ఆడిటోరియంలో 'ది సబర్మతి రిపోర్ట్' చిత్రాన్ని వీక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎంపీలు, నటీనటులతో కలిసి ప్రధాని సినిమా చూశారు.ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమా చిత్ర బృందం వీడియోలో ప్రత్యేకంగా కనిపించారు. ఆడిటోరియంలోకి వెళ్లే సమయంలో సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషితో కలిసి ప్రధాని మోడీ నడుచుకుంటూ వస్తున్న దృశ్యాలు కనిపించాయి.సత్యాన్ని ప్రదర్శించడానికి సినిమా చేసిన ప్రయత్నాలకు ప్రధాని మోడీ ప్రశంసించారు. "ఈ నిజం బయటకు రావడం మంచిది, అది కూడా సాధారణ ప్రజలు చూసే విధంగా. ఒక నకిలీ కథనం పరిమిత కాలం వరకు మాత్రమే కొనసాగుతుంది. అంతిమంగా వాస్తవాలు ఎప్పటికీ బయటకు వస్తాయి! " అంటూ ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు.ధీరజ్ సర్నా దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో విక్రాంత్ మాస్సే, రిధి డోగ్రా, రాశి ఖన్నా నటించారు. ఫిబ్రవరి 27, 2002న గుజరాత్‌లోని గోద్రా స్టేషన్‌కు సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లోని %ూ%-6 కోచ్‌లో జరిగిన విషాదకరమైన దుర్ఘటనకు సంబంధించిన విశేషాలను చిత్రంలో చూపించారు.ఉత్తరప్రదేశ్‌కు చెందిన



యోగి ఆదిత్యనాథ్, గోవాకు చెందిన ప్రమోద్ సావంత్‌తో సహా ముఖ్యమంత్రులు కూడా ఈ చిత్రాన్ని మెచ్చుకున్నారు. కొన్ని రాష్ట్రాలు వీక్షకుల సంఖ్యను ప్రోత్సహించడానికి పన్ను రహితంగా చేయాలని నిర్ణయించాయి. ప్రముఖ నాయకులు మరియు నటీనటులు 2002 నాటి గోద్రా సంఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రధానంగా హైలెట్ అయ్యాయి.

# బీజేపీ మహిళా నేత ఆత్మహత్య..



శాసనసభ / న్యూఢిల్లీ : గుజరాత్‌లోని సూరత్ నగరానికి చెందిన 34 ఏళ్ల బీజేపీ మహిళా నాయకురాలు ఆత్మహత్యకు పాల్పడటం సంచలనంగా మారింది. సూరత్‌లోని వార్డ్ మెంబర్ 30లో దీపికా పటేల్ అనే బీజేపీ మహిళా మోర్చా నాయకులురా ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ఆమె భర్త రైతు, ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఈ ఆత్మహత్యకు సంబంధించి పోలీసులు అన్ని కోణాల్లో విచారణ ప్రారంభించారు.దీపికా పటేల్ నిన్న తన ఇంట్లో ఆత్మహత్య చేసుకుని మరణించింది. కార్పొరేటర్ చిరాగ్ సోలంకి, ఇతర కుటుంబ సభ్యులు ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని సీనియర్ పోలీస్ అధికారి విజయ్ సింగ్ గుర్జార్ తెలిపారు. ఉరివేసుకుని చనిపోయినట్లు పోస్టుమార్టం నివేదిక వెల్లడించింది. ఘటనా స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ దొరకలేదు. కాల్ రికార్డు, ఫోరెన్సిక్ పరీక్షల్ని పోలీసులు విశ్లేషిస్తున్నారు.దీపిక చనిపోయే ముందు చిరాగ్ సోలంకికి చివరిసారిగా ఫోన్ చేసిందని పోలీసులు తెలిపారు. తాను ఒత్తడిలో ఉన్నానని, బతకలేనని దీపిక చిరాగ్‌తో చెప్పిందని వెల్లడించారు. చిరాగ్ ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లే సరికి, తలుపులు మూసేసి ఉన్నాయని, 13, 14, 16 ఏళ్ల పిల్లలు ఇంట్లో మరోగదిలో ఉన్నారని పోలీసులు తెలిపారు. చిరాగ్ తలుపులు పగలగొట్టి చూసే సరికి దీపికా ఉరివేసుకుని కనిపిచింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంలో వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికి లాభం లేకుండా పోయింది. ఆమె ఎందుకు మరణించందనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రస్తుతం చిరాగ్ సోలంకిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. ఆమెను తన సోదరిగా భావించినట్లు సోలంకి చెప్పాడని పోలీసులు తెలిపారు.

# డిసెంబర్ 4 నుంచి తెలంగాణ జాగృతి సమీక్ష సమావేశాలు



శాసనసభ / హైదరాబాద్ : జైలు నుంచి విడుదలయ్యాక కొన్నాళ్లు మౌనంగా ఉన్న బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత స్పీడు పెంచారు. బీఆర్ఎస్ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై చేసే కామెంట్లలోనూ పదును పెంచారు. తాజాగా.. ఆమె మరో కీలక నిర్ణయం తీసుకున్నారు.తెలంగాణ జాగృతి ఉమ్మడి జిల్లా వారీగా డిసెంబర్ 4 నుంచి సమీక్ష సమావేశాలు నిర్వహించనుంది. జాగృతి అధ్యక్షురాలు, BRS ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అధ్యక్షతన వరుసగా సమావేశాలు జరుగనున్నాయి.

- ➢డిసెంబర్ 4: వరంగల్ & నిజామాబాద్
- ➢డిసెంబర్ 5: కరీంనగర్ & నల్గొండ
- ➢డిసెంబర్ 6: రంగారెడ్డి & ఆదిలాబాద్
- ➢డిసెంబర్ 7: హైదరాబాద్ & ఖమ్మం
- ➢డిసెంబర్ 8: మెదక్ & మహబూబ్‌నగర్

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక

# తెలంగాణ జిల్లాలు



# స్ఫూర్తి

## నీ ఆశయం మా గమ్యం

ప || రాజ్యాంగం రాసిన యోధుడు అంబేద్కర్
జగమంతటికి మేధావి అంబేద్కర్

స్వేచ్ఛ సమానత్వం కు ఆయన సందేశం
మానవాళికిచ్చే మహెూన్నత బహుమానం

జైభీం జైభీం ఇదే మా నినాదం
జైభీం జైభీం ఇదే మా రణనాదం 2 || రా ||

చ || దీన జన బతుకుల్లో మెరుపై మెరిసిండు
అనాగరికం అంచు తుంచ ఉరుమై ఉరిమిండు

నీవే నీవే మా పొద్దు పొడుపు
నీవే నీవే మావెన్నెల ముడుపు 2
|| రా ||

చ || మతవాదం పీచమనచ
పుడమిన జనియించిండు
బోధించి సమీకరించి పోరుబాట చూపిండు 2

కుల రక్కసి చితి మంటల మనుధర్మం తగలేసిన అంబేద్కరా .. 2

నీవే నీవే మా రూప శిల్పుడా
నీవే నీవే మా భారత రత్నుడా
|| రా ||

చ || అంటరాని జాతి దాహం తీర్చ మహద్ పోరు చేసిండు
పీడిత తాడిత జనులకు చదువు దారి చూపిండు

పురాణాల గుట్టు విప్పి
అడుగంటిన వర్గంలో చైతన్య దీప్తి రగిలించిన అంబేద్కరా 2

నీ ఆశయం మా గమ్యం
నీ చూపుడు వేలు దారిలో మా పయనం సాధించుట మా
ధ్యేయం

|| జైభీం జైభీం ఇదే మానినాదం
జైభీం జైభీం ఇదే మా రణ నాదం

**- డా. భూతం ముత్యాలు రచయిత**

## పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ క్లాస్ ను సందర్శించిన - మాధగోని నరేందర్ గౌడ్



**చండూర్ డిసెంబర్ 2 (శాసనసభ న్యూస్) :** నల్లగొండ జిల్లా కేంద్రంలో పీఎం విశ్వకర్మ ట్రైనింగ్ క్లాస్ సందర్శించిన బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మాదగోని నరేందర్ గౌడ్.

## కార్తీక మాసం చివరి రోజు కావడంతో తీర్థయాత్రలకు బయలుదేరిన,మహిళలు




**చండూర్ డిసెంబర్ 2 (శాసనసభ న్యూస్) :** ఆదివారం రోజు కార్తీక మాసం చివరి రోజు కావడం తో చండూరు కి చెందిన 30 మంది మహిళలు వాడపల్లి, మట్టంపల్లి కి కటకం లక్ష్మీ ఆధ్వర్యంలో వెళ్లడం జరిగింది. మహిళలు భజన కీర్తనలు చేసుకుంటూ దైవ దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అశ్విని, లక్ష్మమ్మ, ఉమ, క్రాంతి, శోభ, మమత, మానికుమారి, అనురాధ, లలిత, జగతమ్మ, సుగుణ, సునీత, సంతోష, స్వాతి, సంధ్య, అనుష, అండమ్మ, సభిత, చిలకమ్మా, జ్యోతి, లక్ష్మీ, కౌసల్య, ఉమ, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**చండూర్ డిసెంబర్ 2 (శాసనసభ న్యూస్) :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చండూరు మండలం అద్యక్షులు కొరిమి ఓంకారము ఆదేశాల మేరకు బంగారుగడ్డ గ్రామానికి చెందిన బొడ్డు. పాంద్రయ్య కు రూ. 12000/-, ఎండి. షాకేరా కు రూ. 20,500/-,మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం బంగారుగడ్డ గ్రామంలో లబ్ధిదారులకి అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇరిగి రాజు,సుంకరి శివనారి,బోయపల్లి సైదులు,బొడ్డు ముత్తయ్య, బొడ్డు ప్రభాకర్,బి అంజయ్య,మాధగోని లింగయ్య,తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ లో జాతీయ వాయు కాలుష్యం పై అవగాహన






**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 2 :** జాతీయ వాయు కాలుష్య దినోత్సవాన్ని పురస్కరించు కొని సోమవారం నాడు చింతపల్లి కస్తూర్బా గాంధీ పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీదేవి పాల్గొని విద్యార్థులకు వాయు కాలుష్యం పై జరిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. వాయు కాలుష్య కారకాలు నివారణ మానవ ఆరోగ్యపై ప్రభావం గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, కస్తూర్బా గాంధీ టీచర్లు, సిబ్బంది, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలి

**వర్గీకరణకు మాలలు అడ్డుపడితే ఉద్యమిస్తాం**
**మాదిగ ఉద్యోగస్తులు కలిసికట్టుగా ఉద్యమించాలి**
**ఉద్యోగస్తుల కమిటీ ఏకగ్రీవం**
**అధ్యక్షులుగా జిల్లా జంగయ్య,**
**గౌరవ అధ్యక్షులు మస్క్ యాదయ్య ఎంపిక**





**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 02):** రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాలి అని జేఏసీ నాయకులు బోసు పల్లి ప్రతాప్ అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో డిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో యాచారం మండల మాదిగ ఉద్యోగుల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జిల్లా జంగయ్య, కార్యవర్గం,. గౌరవ అధ్యక్షులు మస్క్ యాదయ్య, ఉపాధ్యక్షులు ముళి ఎల్లేష్, ప్రధాన కార్యదర్శి మస్క్ జంగయ్య, కార్యదర్శిలు కనుక యాదయ్య, కొమ్ము ఎల్లయ్య, ప్రధాన సలహాదారులు.. తోట్ల బాలరాజ్,ను నియమించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మనమడు ప్రకాష్ అంబేద్కర్ లాంటివాళ్లే వర్గీకరణకి మద్దతు పలికారు. ఇప్పటికైనా మాలలు సుప్రీంకోర్టు తీర్పు ను గౌరవించాలని అన్నారు.రిజర్వేషన్లు వర్గీకరణ లేకపోవడం వలన రిజర్వేషన్లు దోపిడి జరుగుతుందని, ఆర్థికంగా ఎదిగిన కులాలు అట్టడుగు ఉన్నవారిని అనగదొక్కడం వారు తప్పు పట్టారు. ఉద్యోగస్తులు, మాదిగలు ఒకతాటిపై రావాలని కోరారు. డిసెంబర్ 10 న ఇబ్రహీంపట్నంలో జరిగే మహాసభను వేలాది మంది తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పరమేష్, సిద్ధపురం శ్రీకాంత్, గడ్డం యాదయ్య, బోడ ముత్యాలు, మస్కు మహేష్, మస్కు నవీన్, పల్లేటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధిపై సమీక్ష మండల అధికారులతో సమావేశం





**యాచారం శాసనసభ న్యూస్ ( డిసెంబర్ 02) :** యాచారం మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని యాచారం ఎంపీడీవో నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల అధికారులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాలను డిసెంబర్ 1 నుండి 9 వరకు ప్రతి గ్రామములో విజయోత్సవాలను జరపాలని నిర్ణయించారు. మండల అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పైన ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు. ఎవరైనా నిర్లక్ష్యం వహించిన తగిన చర్యలు ఉంటాయని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి అయ్యప్ప, ఎంపీ ఓ శ్రీలత, పి ఆర్ డి ఈ, మండల వ్యవసాధికారి రవీనాథ్, ఏపీ లింగయ్య, ఈసీ శివశంకర్ రెడ్డి, ఆర్ ఐ లు, గ్రామ సెక్రెటరీలు, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కారింగు రవికి ఆయా పాఠశాల యజమాన్యాలు ఘనంగా సన్మానం

**సన్ పవర్ మార్షల్ ఆర్ట్స్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో.**
**23 వ సన్ పవర్ మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర స్థాయి పోటీలు.**








**చండూర్ డిసెంబర్ 2 (శాసనసభ న్యూస్) :** గాంధీ, గీత, కేజీబివి, మరియానికేటన్, కృష్ణవేణి పాఠశాల ల విద్యార్థులు. 6గురు గోల్డ్ మెడల్స్. ఐతరాజు జశ్వంత్, సంకోజు మణిదీప్, కారింగు మోక్షలక్ష్మి, కారింగు అభిరామ్, జన ఓమ్, కావలి శశాంక్. 9మంది సిల్వర్ సాధించారు. కారింగు అనురూప్, సంకోజు సాయి ప్రణయ్, నక్కపోతు శృతి, దోమలపల్లి వైష్ణవి, దోమలపల్లి క్రిష్, యశ్వంత్, బీమనపల్లి వీణ. గెలుపొందినోళ్లకు మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి పతకాలు అందించారు. పతకాలు సాధించిన విద్యార్థులను,జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా కరాటే శిక్షకుడు కారింగు రవి నీ చండూర్ లోని ఆయా పాఠశాల యజమాన్యాలు ఘనంగా సత్కరించారు.

శాసనసభ

మంగళవారం 03 డిసెంబర్ - 2024

# కోకాకోల కంపెనీకి వచ్చేవి కాళేశ్వరం నీళ్లే :

## మాజీ మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట,డిసెంబర్ 02(శాసనసభ) :** కోకాకోల కంపెనీకి వచ్చేవి కాళేశ్వరం నీళ్లే అని మాజీ మంత్రి తెలిపారు.ఇవ్వాల సీఎం, సిద్దిపేటలో కోకా కోలా ఫ్యాక్టరీ ఓపెనింగ్ కు వెళ్తున్నాడు..కాళేశ్వరం, కొండ పోచమ్మ సాగర్ ప్రాజెక్టు ఉంది కనుక అక్కడ కోకా కోలా ఫ్యాక్టరీ పెట్టారన్నారు హరీష్ రావు. భూ నిర్వాసితులకు ఉద్యోగాలు దొరకాలని ఫ్యాక్టరీ పెట్టించారని తెలిపారు. రెండు తలల పాము కంటే.ఒండు నాలుకలు ఉన్న రేవంత్ చాలా డేంజర్ అంటూ మాజీ మంత్రి హరీష్ రావు చురకలు అంటించారు. సీఎం రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి హరీష్ రావు వీడియోలు ప్రదర్శించారు.ఈ సందర్భంగా హాట్ కామెంట్స్ చేశారు హరీష్ రావు. రెండు తల్కాయల పాము ఉంటది. దాన్ని చూసి మనం భయపడుతం. కానీ పాపం అదేం అనదు. అది పెద్ద ప్రమాదకరం కాదని తెలిపారు. కానీ రెండు నాల్కల మనిషి ఉంటడు. ఆయన్ను చూసి మనంపెద్దేం భయపడం. కానీ వామ్మో శానా ప్రమాదకరం అంటూ రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మండిపడ్డారు. రెండు నాల్కల వైఖరికి నిలువెత్తు నిదర్శనం ఎవరంటేనిస్సందేహంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. డబుల్ ఎడ్జ్డ్ నైఫ్ తో జాగ్రత్తగ ఉండొచ్చు. కానీ డబుల్ టంగ్డ్‌డర్ ప్రజల్ని ముంచిపడేస్తడని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వానాకాలం, యాసంగివి రెండు విడుతల రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్రాంతికి ఇచ్చే రైతు భరోసా రెండు విడుతలు కలిపి ఎకరానికి రూ.15000 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు హరీష్ రావు.

# జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం,అందించిన నసర్లపల్లి గ్రామప్రజలు

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 2 :** చింతపల్లి మండలం,నసర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఇటుకల బట్టీలను ప్రారంభించవద్దని గ్రామస్తులు సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందించారు. ఊరికి దగ్గరగా సర్వే నెం. 277, 278, 14, 15, 16, 19 మరికొన్ని సర్వే నెంబర్లలో సుమారు 200 ఎకరాలలో ఇటుక బట్టీలు అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారు. ఇందులో కొంత ప్రభుత్వ భూమి కూడా ఉంది. బట్టీలలో బండరాళ్లు ఉన్నందున బ్లాసింగ్ చేయుచున్నారు.బ్లాస్టింగ్ వలన గ్రామములో పూర్తిగా దుమ్ము, దూళి వలన ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. బట్టీల నుండి వెలువడే పొగ ద్వారా వృద్దులకు, చిన్నపిల్లలకు, గర్భిణీలకు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలు కలుగుచున్నవి. ఇటుకలు రవాణా చేసే లారీల రాకపోకల వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. దాని వలన ప్రజలకు రవాణా, రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.కావున ఇటుక బట్టీలు తొలగించాలని నర్సర్లపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. నసర్లపల్లి గ్రామ పంచాయతీ ప్రజలు మొదటిసారి ప్రజావాణిలో తేది 04.07.2024నాడు ఫిర్యాదుచేసారు. అధికారులు స్పందించి తేది 06.07.2024 నాడు మైనింగ్ శాఖ, తహశీల్దారు, పోలీసు శాఖ అధికారులు వచ్చి అక్రమ ఇటుక బట్టీలను సీజ్ చేసినారు. కానీ ఇటుక బట్టీల నిర్వాహకులు మళ్లీ ఇటుక బట్టీలను తిరిగి యథావిధిగా, కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. అక్రమంగా నిర్వహణ చేయుచున్నారు.దీంతో గ్రామ ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.కావున అధికారులు మరలా స్పందించి ఇట్టి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, అట్టి బట్టీలను శాశ్వతంగా సీజ్ చేయగలరని మవని. లేని ఎడల మాయొక్క గ్రామ ప్రజలు పెద్ద ఎత్తుల ఆందోళన చేపట్టేందుకు సిద్ధముగా ఉన్నామని తమరికి తెలియజేయుచున్నాము. గ్రామ ప్రజల యొక్క పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొడిదాల శీను, ఆర్. శివ, గిరి, నల్ల శ్రీకాంత్, నల్ల ఆంజనేయులు, నల్ల కాశయ్య, నల్ల వెంకటరమణ , తదితరులు పాల్గొన్నారు.

# చెట్టిమల్ల విక్రం మృతి భాధకరం

### - విక్రం కుటుంబాన్ని ఓదార్చి,ఆర్థిక సహాయం అందించిన మాల మహానాడు నాయకులు.

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 2 :** చింతపల్లి మండలం ఘడియగౌరారం గ్రామానికి చెందిన చెట్టిమల్ల విక్రం ఇటీవల ప్రమాదవశాత్తు యాక్సిడెంట్స్ లో మరణించిన విక్రం తల్లిదండ్రులు వెంకటమ్మ ,వెంకయ్య కుటుంబ సభ్యులను సోమవారం నాడు మాల మహానాడు డివిజన్ నాయకులు పరామర్శించి,పది వేలు ఆర్థిక సహాయం అంద చేశారు.అనంతరం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బహుజన నాయకుడు జిల్లా కో ఆర్డినేటర్ యేకుల రాజారావు మాట్లాడుతూ చెట్టిమల్ల విక్రం చనిపోవటం చాలా బాధాకరం అన్నారు. విక్రం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం కోసం ఎంతో కృషి చేశారని ఆయన అన్నారు.మాలల సింహ గర్జన సభ విజయవంతం కై ఘడియ గౌరారం తమ స్వగ్రామంలో పోస్టర్లు,కరపత్రాలు ద్వారా మాలలను చైతన్యం చేసిన విక్రం చనిపోవడం బాధాకరం అన్నారు.విక్రం మరణం పట్ల మాల మహానాడు నాయకులు కుటుంబ సభ్యులను ఓదార్చి, సంతాపం సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు యేకుల సురేష్, నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి , ప్రధాన కార్యదర్శి మేడ సైదులు , అడ్వకేట్ నూనె సురేష్,పంబలి వెంకటయ్య,ఎర్ర వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాయపోల్ పరువు హత్య పై నిరసన

**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 2 :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామానికి చెందిన కొంగరి నాగమణి అనే కానిస్టేబుల్ పై జరిగిన పరువు హత్య పై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేశారు. జిల్లా అధ్యక్షులు బోడ సామెల్ మాట్లాడుతూ, రాయపోల్ గ్రామానికి చెందిన కొంగరి నాగమణి అనే కానిస్టేబుల్ వయస్సు 27 సంవత్సరాలు కులం కురుమ అదే గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్ వయస్సు 28 సంవత్సరాలు కులం మాల అను అతన్ని 2024 నవంబర్ 10న యాదగిరిగుట్ట దేవాలయంలో వివాహం చేసుకున్నది తక్కువ కులం వాడిని పెళ్లిచేసుకుంటావా అని డ్యూటీ కి వెళ్తున్న నాగమణి కానిస్టేబుల్ తన తమ్ముడైన పరమేష్ కారుతో గుద్ది వేటకొడవలితో నరికి చంపడం జరిగింది, అంటరానితనం అనేది నేటికీ కొనసాగుతున్న పరిస్థితి చూస్తున్నాం ప్రభుత్వాలు కులాంతర వివాహాలు చేసుకున్న వారికి ప్రోత్సహించవలసినంతా ప్రోత్సహించడం లేకపోవడంతో ఇలాంటి పరువు హత్యలు జరుగుతున్నాయన్నారు.గతంలో మిర్యాలగూడకు చెందిన మారుతి రావు తన బిడ్డ అమృత తక్కువ కులానికి చెందిన ప్రణయ్ ని పెళ్లి చేసుకుంటే అతికిరాతకంగా చంపారు. అదే రూపంలో సోమవారం నాగమణి తమ్ముడు పరమేష్ కూడా పరువు హత్య చేసినందుకు తీవ్రంగా ఖండిస్తున్నాం,పరువు హత్యకు ప్రోత్సహించిన వారిని హత్య చేసిన వారిపై కఠినమైన చర్యలుతీసుకోవాలని ఈఆత్మహత్య చేసిన వారిపై కఠినమైన చర్యలుతీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సెక్షన్లుపెట్టి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలియజేస్తూ నాగమణి భర్త శ్రీకాంత్ వారి బంధువులు పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై బయటాయిస్తే సంఘంగా పోయి బేకరీ శ్రీకాంత్ ను పరామర్శించి ఓదార్చారు. అనంతరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి శ్రీకాంత్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ శ్రీకాంత్ కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని శ్రీకాంత్ భార్యను చంపిన పరమేష్ ను అతనికి సహకరించిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కెపిఎస్ నాయకులు ఏం ఆనంద్, ప్రభుదాస్, జి మహేష్, యాదగిరి, సిహెచ్ జంగయ్య, చింతపట్ల ఎల్లేష్, బుగ్గ రాములుడి కిషన్,శంకర్ చరణ్, తరంగ్, శ్రీకాంత్, వంశీ వినయ్, నరసింహ్మా సిహెచ్ రాఘవేందర్, మాల మహానాడు నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# కోకాకోలా ఫ్యాక్టరీని ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- 1400 కోట్లతో 49 ఎకరాల్లో కంపెనీ ప్రారంభం
- 1000 మందికి ఉపాధి అవకాశాలను కల్పించిన హెచ్‌సిసిబి
- కార్యక్రమంలో హెచ్‌సిసిబి సీఈఓ జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్,మంత్రులు












**సిద్దిపేట,డిసెంబర్ 02(శాసనసభ) :** తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేటలోని బండ తిమ్మాపూర్‌లో హిందూస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సిసిబి) ఏర్పాటుచేసిన అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భారతదేశంలోని ప్రముఖ ఎఫ్‌ఎంసిజి కంపెనీలలో ఒకటైన హిందూస్థాన్ కోకాకోలా బెవరేజెస్ (హెచ్‌సిసిబి) కి ఇది ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ ప్రారంభోత్సవానికి సమాచార, ఐటి, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్, పరిశ్రమలు & వాణిజ్యం,శాసన వ్యవహారాల శాఖల గౌరవ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్,అటవీ & పర్యావరణం మరియు సైన్స్ & టెక్నాలజీ శాఖల మంత్రి కొండా సురేఖ ,హెచ్‌సిసిబి సీఈఓ శ్రీ జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్‌తో పాటు మరియు కంపెనీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు సహా ముఖ్య ప్రముఖులు హాజరయ్యారు.49 ఎకరాల్లో నిర్మించబడిన ఈ కర్మాగారం మొత్తం రూ. 2,091 కోట్ల (యుఎస్ 251 మిలియన్ డాలర్లు) పెట్టుబడిని కలిగి ఉంది, అందులో రూ. 1,409 కోట్లు (యుఎస్ 170 మిలియన్ డాలర్లు) ప్రస్తుత దశ కోసం ఇప్పటికే ఉపయోగించబడింది. ఈ సదుపాయం 7 అధునాతన ఉత్పత్తి మార్గాలను నిర్వహిస్తుంది మరియు 410 మంది వ్యక్తులకు ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధిని కల్పించడానికి సిద్ధంగా ఉంది.సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఇప్పటికే ఉన్న కర్మాగారానికి అనుబంధంగా తెలంగాణలో హెచ్‌సిసిబి కి ఇది రెండవ ఫ్యాక్టరీ. ఈ రెండూ కలిసి , రూ. 3,798 కోట్ల (యుఎస్ 455.5 మిలియన్ డాలర్లు ) సంయుక్త పెట్టుబడితో మరియు 1,000 మందికి పైగా వ్యక్తులకు ఉపాధితో తెలంగాణలో హెచ్‌సిసిబి యొక్క గణనీయమైన మరియు పెరుగుతున్న ఉనికిని నొక్కిచెబుతున్నాయి. హెచ్‌సిసిబి రాష్ట్రంలో దాదాపు 1,80,000 మంది రిటైలర్‌ల యొక్క బలమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉంది, ఆర్థిక వృద్ధికి కీలకమైన డ్రైవర్‌గా దాని పాత్రను మరింత పటిష్టం చేస్తుంది.బండ తిమ్మాపూర్‌లోని కొత్త ఫ్యాక్టరీ అధునాతన సాంకేతికతలు మరియు పర్యావరణ స్పృహతో కూడిన పద్ధతులను ఏకీకృతం చేయడానికి ఆలోచనాత్మకంగా రూపొందించబడింది. కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించే ఆటోమేటెడ్ సిస్టమ్‌ల నుండి పునరుత్పాదక శక్తి కార్యక్రమాల వరకు, ఇది దాని పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడానికి ప్రాధాన్యతనిస్తుంది. పర్యావరణ అనుకూలమైన శీతలీకరణ వ్యవస్థలు, నీటి పునర్వినియోగ పద్ధతులు మరియు క్లీనర్ ఎనర్జీ సొల్యూషన్‌లతో సహా అదనపు చర్యలు, బాధ్యతాయుతంగా నిర్వహించడంలో హెచ్‌సిసిబి యొక్క అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయి. ఈ కర్మాగారం వ్యాపార వృద్ధిని సంఘం మరియు పర్యావరణ శ్రేయస్సుతో సమలేఖనం చేయడానికి హెచ్‌సిసిబి యొక్క ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది, ఇది ప్రాంతం యొక్క పురోగతికి సానుకూలంగా దోహదపడుతుంది.ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "బండ తిమ్మాపూర్‌లో హెచ్‌సిసిబి పెట్టుబడులు, ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు ఆకర్షణ శక్తిగా వెలుగొందుతున్న తెలంగాణ ఖ్యాతిని నొక్కి చెబుతుంది. వ్యాపార వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి మేము కట్టుబడి ఉన్నాము. సమగ్ర విధానం అనుసరిస్తున్న హెచ్‌సిసిబిని మేము అభినందిస్తున్నాము. ఇది ఉద్యోగాలను తెస్తుంది, కమ్యూనిటీలను ఉద్ధరిస్తుంది మరియు ఈ ప్రాంతం అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుంది" అని అన్నారు.మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. "బండ తిమ్మాపూర్‌లో హెచ్‌సిసిబి పెట్టుబడులు పారిశ్రామిక వృద్ధి మరియు పర్యావరణ పరిరక్షణ కలిసి ఎలా సాగుతాయి అనేదానికి ఒక ప్రధాన ఉదాహరణగా నిలుస్తాయి. ఈ అత్యాధునిక గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీ తెలంగాణ పారిశ్రామిక ప్రకృతి దృశ్యానికి ప్రధాన జోడింపుగా నిలుస్తుంది మరియు ఈ ప్రాంతం కోసం పర్యావరణ అనుకూల వృద్ధి మరియు సంపదకు తోడ్పడనుంది" అని అన్నారు.మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. "బండ తిమ్మాపూర్‌లోని హెచ్‌సిసిబి గ్రీన్‌ఫీల్డ్ సదుపాయం పారిశ్రామిక పురోగతి మరియు సమాజ అభివృద్ధికి మధ్య ఉన్న సమన్వయానికి ఉదాహరణగా నిలుస్తుంది. నైపుణ్యం కలిగిన ఉపాధిని సృష్టించడం మరియు యువత, మహిళలు మరియు గ్రామీణ వర్గాలకు సాధికారత కల్పించే కార్యక్రమాలతో ఏకీకృతం చేయడం ద్వారా, ఈ పెట్టుబడి పర్యావరణ అనుకూల మరియు సమ్మిళిత వృద్ధికి కేంద్రంగా తెలంగాణ స్థానాన్ని బలోపేతం చేస్తుంది" అని అన్నారు.మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. "పర్యావరణ అనుకూల పారిశ్రామిక వృద్ధికి ఇది గొప్ప ఉదాహరణ. పునరుత్పాదక ఇంధనం మరియు నీటి పునర్వినియోగం వంటి పర్యావరణ అనుకూల సాంకేతికతలను ఏకీకృతం చేయడం ద్వారా, ఈ ఫ్యాక్టరీ తెలంగాణలో పర్యావరణ బాధ్యత కలిగిన తయారీకి ఒక ప్రమాణాన్ని నిర్దేశిస్తుంది" అని అన్నారు. హిందుస్థాన్ కోకా-కోలా బెవరేజెస్ సీఈఓ జువాన్ పాబ్లో రోడ్రిగ్జ పెట్టుబడుల గురించి మాట్లాడుతూ, "హెచ్‌సిసిబి వృద్ధి ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు మరియు తెలంగాణ పట్ల మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తుంది. ఈ అత్యాధునిక ఫ్యాక్టరీ అధునాతన తయారీ, పర్యావరణ అనుకూల సాంకేతికతను మిళితం చేసింది. దీనిని మన పరిశ్రమలో ఒక బెంచ్‌మార్క్‌గా నిలువుతుంది. ఈ ప్రభుత్వం ప్రత్యేకించి గౌరవనీయులైన ముఖ్యమంత్రి మరియు పరిశ్రమల శాఖామంత్రి ప్రత్యేకంగా చొరవ తీసుకుని ట్యాపింగ్ పాయింట్ కనెక్షన్ , మిషన్ భగీరథ ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపరితల నీటి పైప్‌లైన్‌ను పూర్తి చేయటం మరియు మా ఫ్యాక్టరీ కార్యకలాపాలకు విద్యుత్ లభ్యత కోసం త్వరిత అనుమతిని అందించడం చేశారు. అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ, ఈ నూతన గ్రీన్ ఫీల్డ్ ఫ్యాక్టరీ లో మా ఉత్పత్తిని ప్రారంభించటానికి అవి తోడ్పడ్డాయి" అని అన్నారు.తెలంగాణలో అనేక రకాల సామాజిక అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పరివర్తనాత్మక మార్పును హెచ్‌సిసిబి కొనసాగిస్తుంది, ఈ ప్రాంతానికి శాశ్వతమైన, దీర్ఘకాలిక ప్రయోజనాలను సృష్టిస్తుంది. సంస్థ యొక్క కార్యక్రమాలు 1,73,000 మంది లబ్ధిదారులపై ప్రభావం చూపాయి, వీటిలో యువతకు సేల్స్ మరియు మార్కెటింగ్ నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం , డిజిటల్ మరియు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా మహిళలకు సాధికారత కల్పించటం వంటివి ఉన్నాయి. హెచ్‌సిసిబి పలు పాఠశాలల్లో వాటర్ ఏటిఎం లు మరియు స్మార్ట్‌బోర్డ్‌లను ఏర్పాటు చేయడంతో స్వచ్ఛమైన నీరు మరియు విద్యకు అవకాశాలను మెరుగుపరిచింది.అదనంగా, పర్యావరణ అనుకూల వ్యవసాయం, పారిశుద్ధ్యం మరియు ఆరోగ్యంలో సంస్థ యొక్క ప్రయత్నాలు వేలాది స్థానిక కుటుంబాలకు గణనీయంగా ప్రయోజనం చేకూర్చాయి. హెచ్‌సిసిబి వ్యూహాత్మక భాగస్వామ్యాలను సైతం ఏర్పాటు చేసింది. వీటిలో, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) భాగస్వామ్యం తో క్యాంపస్ టు కార్పొరేట్ ప్రోగ్రామ్ కింద 10,000 మంది కళాశాల విద్యార్థులకు ఉద్యోగ సన్నద్ధతలో శిక్షణ ఇవ్వనుంది. వీరిలో , గ్రామీణ ప్రాంతాల నుంచి 70% కు పైగా ఉండనున్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వంతో ఎమ్ఒయు కుదుర్చుకుని నీటి నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ మరియు నైపుణ్యాన్ని పెంపొందించడంలో దీర్ఘకాలిక కార్యక్రమాలు సైతం హెచ్‌సిసిబి నిర్వహిస్తుంది. ఈ సమగ్ర ప్రయత్నాల ద్వారా, తెలంగాణ అంతటా ఉన్న కమ్యూనిటీలకు శాశ్వత సానుకూల ప్రభావాన్ని నిర్ధారిస్తూ, ఈ ప్రాంతం యొక్క స్థిరమైన వృద్ధికి హెచ్‌సిసిబి దోహదపడుతోంది.

# వెల్లుల్లి చేసే ఆరోగ్య అద్భుతాలు తెలిస్తే రోజూ తింటారు!



వెల్లుల్లి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.ముఖ్యంగా చలి కాలంలో వెల్లుల్లి తింటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. చలికాలంలో మనకు త్వరగా అనారోగ్య సమస్యలు వస్తాయి. రకరకాల ఇన్ఫెక్షన్లు మనలను ఇబ్బంది పెడతాయి.అయితే చలికాల ంలో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు వెల్లుల్లి మంచి పరిష్కారాన్ని చూపిస్తుంది. వెల్లుల్లి మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంపొం దించుకోవడానికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది.

**వెల్లుల్లితో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు**

వెల్లుల్లిలోని అలిసిన్ అనే యాంటీ బ్యాక్టీరియల్ కాంపోనెంట్ మన శరీరంలో రోగనిరోధక శక్తిని బాగా పెంచుతుంది. వెల్లుల్లి తింటే మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గిపోతుంది. వెల్లుల్లిలో అలిసిన్ ఉండడం వల్ల ఇది మన గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ప్రతీరోజూ రెండు వెల్లుల్లి రెబ్బలను ఉదయాన్నే తినేవారు గుండె పోటుకు గురి కారు.

**వెల్లుల్లితో బీపీ, కొలెస్ట్రాల్ లకు చెక్**

వెల్లుల్లిలో కర్కుమిన్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి అనేక దీర్ఘకాలిక వ్యాధుల నుండి కాపాడుతుంది.వెల్లుల్లి మన బీపీని కూడా కంట్రోల్ చేసి కొలెస్ట్రాల్ స్థాయిలను నార్మల్ గా ఉండేలా చేస్తుంది. వెల్లుల్లితో ఇన్ఫ్లమేషన్ బాగా తగ్గుతుంది. ఇది మన కీళ్లనొప్పుల నివారణకు ఎంతో బాగా ఉపయోగపడుతుంది. వెల్లుల్లిలో ఉండే గుణాలు మన శరీరంలో ఫ్రీ రాడికల్స్ తో పోరాడతాయి.

**వెల్లుల్లితో ట్రైగ్లిజరైడ్స్ కు చెక్**

వెల్లుల్లి ఊపిరితిత్తులకు మంచి చేస్తుంది. ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ ఉన్నవారికి వెల్లుల్లి ఎంతో బాగా పనిచేస్తుంది. వెల్లుల్లిలో విటమిన్ సి, విటమిన్ b6, మాంగనీస్, సెలీనియం అధికంగా ఉంటాయి. ఇవి మన శరీర ఆరోగ్యానికి ఎంతో దోహదం చేస్తాయి. వెల్లుల్లి మన రక్తంలోని ట్రై గ్లిజరైడ్స్‌ను తగ్గిస్తాయి. వెల్లుల్లిని మూడు రోజులపాటు తేనెలో నానబెట్టి ప్రతిరోజు ఉదయం 3 వెల్లుల్లి రెబ్బలను తింటే ట్రైగ్లిజరైడ్స్ బాగా తగ్గుతాయని చెబుతారు.

**వెల్లుల్లి మితంగా రోజూ తీసుకుంటేనే ఫలితం**

ఇక మనకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూర్చే వెల్లుల్లి ప్రతిరోజు తీసుకోవడం మంచిది. అయితే వెల్లుల్లి అధిక మొత్తంలో తీసుకుంటే మాత్రం జీర్ణక్రియ సమస్యలు, అలర్జీలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వెల్లుల్లిని పరిమితంగా ప్రతిరోజు ఒక క్రమ పద్ధతిలో తీసుకోవడం మంచిది.

# పొద్దుతిరుగుడు నూనెను వంటల్లో వాడుతున్నారా? ఇది ఆరోగ్యానికి మంచిదేనా?

పొద్దుతిరుగుడు నూనె వంటకాల్లో ప్రధానంగా ఉపయోగించ బడుతున్న నూనెల్లో ఒకటి. ఇది రుచికి మంచిదే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది.కానీ దానిని ఉపయోగించే విధానం, పరిమాణం ఆరోగ్యంపై కీలక ప్రభావం చూపుతుంది. అన్ని నూనెల మాదిరిగానే, పొద్దుతిరుగుడు నూనెను కూడా మితంగానే తీసుకోవాలి.

**పొద్దుతిరుగుడు నూనె యొక్క ప్రయోజనాలు:**



పొద్దుతిరుగుడు నూనెలో విటమిన్ E,K ఎక్కువగా ఉంటాయి. విటమిన్ E శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పని చేస్తూ చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.ఈ నూనెను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇందులో పాలీఅన్ సెచ్యురేటెడ్ ఫ్యాటీ ఆమ్లాలు, మోనోఅన్ సెచ్యురేటెడ్ ఫ్యాట్స్ ఉంటాయి, ఇవి మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పొద్దుతిరుగుడు నూనెలో ఉండే విటమిన్ E, యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలోని కణాలను నష్టం నుండి రక్షిస్తాయి.చర్మాన్ని మాయిశ్చ రైజ్ చేసి,మృదువుగా చేస్తుంది.అంతే కాకుండా పొద్దుతిరుగుడు నూనె జుట్టును బలపరుస్తుంది, జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది. పొద్దుతిరుగుడు నూనె తేలికగా జీర్ణమయ్యే నూనెలలో ఒకటి. ఇది కడుపులో అలసట లేకుండా నెమ్మదిగా జీర్ణమవుతుంది.

**పొద్దుతిరుగుడు నూనె వల్ల కలిగే దుష్ప్రభావాలు**

అధిక ఉష్ణోగ్రత వద్ద పొద్దుతిరుగుడు నూనెను వేడి చేయడం వల్ల ఆరోగ్యానికి హానికరమైన పదార్థాలు విడుదలవుతాయి. ఇవి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని పెంచుతాయి.ఈ నూనెలో ఓమెగా-6 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉంటాయి. ఓమెగా-6 అధికంగా తీసుకోవడం శరీరంలో వాపులను పెంచే అవకాశం కల్పిస్తుంది. పొద్దుతిరుగుడు నూనె మితంగా ఉపయోగించాలి. ఎక్కువగా ఉపయోగించడం వల్ల కాలరీలు అధికమవుతాయి. ఇది బరువు పెరగడానికి దారి తీస్తుంది.

**పొద్దుతిరుగుడు నూనె ఎంపిక.**

రెండు రకాల పొద్దుతిరుగుడు నూనెలు ఉన్నాయి - హై ఒలేయిక్ మరియు హై లినోలిక్. హై ఒలేయిక్ నూనెలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. హై లినోలిక్ నూనెలో పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. కూల్-ప్రెస్డ్, అన్‌రిఫైన్డ్ పొద్దుతిరుగుడు నూనెను ఎంచుకోవడం మంచిది. ఎందుకంటే ఇందులో పోషక విలువలు అధికంగా ఉంటాయి. పొద్దుతిరుగుడు నూనె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. కానీ, ఏదైనా ఆహారం మాదిరిగానే, పొద్దుతిరుగుడు నూనెను కూడా మితంగా తీసుకోవాలి. మీ ఆహారంలో పొద్దుతిరుగుడు నూనెను చేర్చే ముందు మీ వైద్యుని సలహా తీసుకోవడం మంచిది.

# ఫూల్ మఖానా తింటే ఈ సమస్యలన్నీ దూరం.. ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అవాక్కే..!



తామర గింజలు వేయించి తినడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయి. వీటిని మార్కెట్‌లో ఫూల్ మఖానా అని అమ్ముతారు. ఫూల్ మఖానా చూడడానికి తెల్లగా, గుండ్రంగా ఉంటాయి.ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. తామర గింజలు తినడం వల్ల శరీరానికి అనేక పోషకాలు అందుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు అందుతాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి అందే పోషకాలు ఏంటో మనం ఇప్పుడు తెలుసుకుందాం.తామర గింజలు తినడం వల్ల శరీరానికి అనేక పోషకాలు అందుతాయని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. వీటిని మార్కెట్‌లో ఫూల్ మఖానా అని అమ్ముతారు. ఈ ఫూల్ మఖానాతో చిరుతిళ్లు, కూరలను తయారు చేస్తుంటారు. ఇందులో ప్రోటీన్,ఫైబర్ శాతం అధికంగా లభిస్తుంది. ఫూల్ మఖానాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అధిక బరువుతో ఉన్నవారు ఆకలి ఎక్కువగా ఉంటే ఈ మఖానా తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దాంతో పదే పదే తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గుతారు.ఫూల్ మఖానాలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. దీని తీసుకోవడం వల్ల సులభంగా బరువు సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. అంతేకాకుండా దీని వల్ల నరాల పనితీరు మెరుగుపడుతుందని ఆరోగ్యనిపుణులు చెబుతున్నారు. ఫూల్ మఖానాలో మెగ్నీషియం ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఎముకలను, దంతాలను ధృడంగా ఉంచడంలో కూడా ఫూల్ మఖానా మనకు సహాయపడుతుంది. ప్రతిరోజు వీటిని తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు వంటివి తగ్గుతాయి.ఫూల్ మఖానాతో గుండె పనితీరును మెరుగుపరచడంలో ఫూల్ మఖానా ఎంతో మేలు చేస్తుంది. ఇందులోని మెగ్నీషియం, గల్లిక్ యాసిడ్స్ గుండెపోటు వంటి వ్యాధులను తగ్గిస్తుంది. రక్తహీనత సమస్యను దూరం చేయడంలో ఫూల్ మఖానా సహాయపడుతుంది. కిడ్నీల్లోని ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను తగ్గిస్తాయి. రాళ్లు ఏర్పడకుండా ఫూల్ మఖానా కాపాడతాయి. ఈ విధంగా ఫూల్ మఖానా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# బాగా పండిన అరటి పండ్లు పడేస్తున్నారా..? మీరు ఆరోగ్యాన్ని కోల్పోతున్నట్లే..! తెలిస్తే ఆశ్చర్యపోతారు..



బాగా పండిన అరటి పండులో టన్నుల కొద్దీ పోషకాలు ఉంటాయని మీకు తెలుసా..? శరీరానికి సరైన జీవక్రియలను నిర్వహించడానికి ఎంతగానో సహాయపడుతుంది. సులభంగా జీర్ణం అవుతాయి.దీంతో జీర్ణ సమస్యలు తగ్గుతాయి. గ్యాస్, మలబద్ధకం, అసిడిటీని దూరం చేస్తుంది.విరేచనాలు తగ్గుతాయి.సాధారణంగా పండిన అరటి పండ్లతో పోలిస్తే బాగా పండిన అరటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. యాంటీఆక్సిడెంట్స్ అధికంగా ఉన్న కారణాన, కణ నష్టాన్ని నిరోధిస్తుంది. అంతర్గత డ్యామేజీలు, ఫ్రీ రాడికల్స్ వలన కలిగే కణాల నష్టాన్ని తగ్గించడానికి బాగా పండిన అరటి పండు ఉపయోగపడుతుంది.అరటి పండ్లు అల్సర్స్ సమస్యతో బాధపడు తున్న వారికి,అత్యంత లాభదాయకమైన పండుగా ఉంటుంది. అల్సర్ సమస్యతో ఉన్న వ్యక్తి నిస్సంకోచంగా ఈ పండిన అరటి పండును తీసుకొనవచ్చు.అలాగే,పండిన అరటి పండ్లలో పొటాషియ ం సమృద్ధిగా ఉంటుంది.మరియు సోడియం నిక్షేపాలు తక్కువగా ఉంటాయి.ఇది మీ కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడానికి మేలు చేస్తుంది.ఒక మోస్తరుగా పండిన అరటి పండ్ల కన్నా బాగా పండిన అరటి పండ్లలోనే పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బాగా పండిన అరటి పండ్లను తింటేనే శక్తి బాగా లభిస్తుంది. దీంతో అలసిపోకుండా పనిచేయవచ్చు.పండిన అరటి పండ్లలో ఐరన్ అధికంగా ఉన్న కారణాన అనీమియా సమస్యను నివారిస్తుంది. పండిన అరటి పండ్లను తినడం వల్ల మీ రక్త స్థాయిలను సహజ సిద్ధంగా పెంచడానికి సహాయపడుతుంది. బాగా పండిన అరటి పండ్లను తింటే శక్తి బాగా లభిస్తుంది. ఉత్సాహం వస్తుంది. నీరసం, నిస్సత్తువ తగ్గిపోతాయి. ఉత్సాహంగా పనిచేస్తారు.

# చింతచిగురును ఆహారంలో చేర్చుకుంటున్నారా?

చింతచిగురును భారతీయ ఆహారంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. ఇది తెలుగు వారికి చాలా ప్రత్యేకమైనది.ఇది పులుపు రుచితో, ఆహారానికి ప్రత్యేకమైన రుచిని,ఘాటుదనాన్ని అందిస్తుంది. చింతచిగురును ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.ఈ ఆకులు పోషకాలు, యాంటీఆక్సి డెంట్లు, ఔషధ గుణాల ద్వారా శరీరానికి మేలు చేస్తాయి. వేసవి కాలంలో మనకు సులభంగా దొరికే ఈ చింతచిగురును ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుందాం..



**చింతచిగురుతో ఆరోగ్య ప్రయోజనాలు**

**1. జీర్ణ వ్యవస్థకు మేలు**

చింతచిగురు ఆహారంలో చేర్చుకోవడం వల్ల జీర్ణాశయం మెరుగ్గా పనిచేస్తుంది.ఇందులో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడు తుంది. పులుపు స్వభావం ఆకలిని పెంచుతుంది మరియు కడుపులో గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది.

**2. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది**

చింతచిగురులో నేచురల్ యాసిడ్స్ ఉండటంతో ఇది జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది.పులుసు వంటి వంటకాలలో చింతచిగురు వినియోగం జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది.

**3. ఇమ్యూనిటీ పెంపు**

చింతచిగురులో విటమిన్ సి,యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.ఇవి రోగనిరోధక వ్యవస్థను బలపరచడం ద్వారా శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తాయి. ఇది జలుబు, దగ్గు వంటి సమస్యలు తగ్గిస్తుంది.

**4. ఎముకల బలం పెంపు**

చింతచిగురులో కాల్షియం ఉండటం వలన ఇది ఎముకల బలాన్ని పెంపొందిస్తుంది. ఇది ప్రధానంగా పిల్లల మరియు వృద్ధుల ఎముకల ఆరోగ్యానికి మంచిది.

**5. రక్త శుద్ధి**

చింతచిగురులో ఉన్న యాంటీఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడతాయి.ఇది టాక్సిన్లను తొలగించి చర్మం ఆరోగ్యవంతం గా కనిపించేలా చేస్తుంది.

**6. చర్మ సమస్యలు**

చింతచిగురును వాడటం మూలంగా చర్మ సమస్యలు, అలర్జీలు తగ్గుతాయి. దీని శీతల స్వభావం చర్మానికి తేమను అందించి, పొడిబారడం నివారిస్తుంది. చింతచిగురులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని మృదువుగా , ఆరోగ్యంగా ఉంచుతాయి.

**7. డిటాక్స్ ఫలితాలు**

చింతచిగురులో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉండటం వల్ల ఇది శరీరంలో నెమ్మదిగా ఉండే ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తుంది. ఇది ముఖ్యంగా కాలేయం ఆరోగ్యం కోసం ఉపయోగకరం.

**8. రక్తపోటు నియంత్రణ**

చింతచిగురులో ఉన్న పోషకాల ద్వారా రక్తపోటు స్థాయిలు సాధారణంగా ఉండేలా చేస్తుంది. ఇది ముఖ్యంగా హైబ్లడ్‌ప్రెషర్ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.

**9. మానసిక ఆరామం**

చింతచిగురు ఆహారంలో చేర్చుకోవడం ద్వారా శరీరానికి ప్రశాంతత కలుగుతుంది. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించి, శరీరాన్ని ఉత్తేజితంగా ఉంచుతుంది. చింతచిగురు కేశాలకు మంచిది. ఇది జుట్టు రాలడాన్ని నిరోధిస్తుంది.జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. చింతచిగురును పప్పు, పులుసు, సూప్‌లలో ఉపయోగిస్తారు. ఈ ఆకుల సహజ రుచితో ఆహారం ప్రత్యేకమైన రుచిని పొందుతుంది. అయితే చింతచిగురును అధికంగా తీసుకోవడం ఆమ్లత్వాన్ని పెంచవచ్చు. కడుపు సమస్యలున్నవారు డాక్టర్ సూచనతో మాత్రమే వినియోగించాలి.

# రాసి పెట్టుకోండి.. ఈ నక్షత్రాలలో పుట్టినవారు జీవితాంతం కుబేరులే!

వేద జ్యోతిష్య శాస్త్రం ప్రకారం మాత్రమే కాదు పుట్టిన నక్షత్రం కూడా వివిధ జాతకుల జీవితాన్ని నిర్ణయిస్తుంది. కొన్ని నక్షత్రాలలో పుట్టిన వారు వారి పుట్టిన నక్షత్రాన్ని బట్టి కొందరు సానుకూల ఫలితాలను, కొందరు ప్రతికూల ఫలితాలను పొందుతారు.కొన్ని నక్షత్రాలలో జన్మించిన వారికి ఆర్థిక పరిస్థితి జీవితాంతం లోటు లేకుండా, తిరుగులేకుండా సాగిపోతుంది. వారంతా పుట్టుకతోనే అదృష్టవంతులుగా ఉంటారు.



**సంపన్నులుగా చేసే అదృష్ట నక్షత్రాలు**

ఎవరైనా సరే పుట్టిన సమయాన్ని బట్టి ఆ సమయంలో ఉన్న నక్షత్రాన్ని జన్మ నక్షత్రంగా భావిస్తాం. ఆ విధంగా చూస్తే వారి జన్మ నక్షత్రం ఆధారంగా కూడా వారి జీవితం ఉంటుంది. ముఖ్యంగా కొన్ని నక్షత్రాలలో పుట్టిన వారికి అదృష్టం మామూలుగా ఉండదు. వారు అన్ని విధాల ఆర్థిక ప్రయోజనాలను పొందటమే కాకుండా జీవితాంతం సంపన్నులు గానే ఉంటారు. మరి ఆ అదృష్ట నక్షత్రాలు ఏమిటో ప్రస్తుతం మనం తెలుసుకుందాం.

**అశ్విని నక్షత్రం**

అశ్విని నక్షత్రంలో పుట్టిన వారు ఏ రంగంలోనైనా ఒక వెలుగు వెలుగుతారు. వీరు చిన్నప్పటి నుంచే సంపన్నులుగా ఉంటారు. సాధారణంగా తెలివితేటలు, ధైర్య సాహసాలు కలిగిన వారుగా ఉంటారు. సొంత ఆలోచనలతో జీవితాంతం వీరు గొప్పగా జీవిస్తారు.

**భరణి నక్షత్రం**

భరణి నక్షత్రంలో పుట్టిన వారు జీవితాంతం ధనవంతులుగా ఉంటారు. వీరు స్థిరాస్తులను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. ఈ జన్మ నక్షత్రానికి అధిపతి శుక్రుడు కావడంతో వీరు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. అందాన్ని ఆరాధించేవారుగాను, ఆనందాన్ని కోరుకునే వారిగాను, కళా పోషకులుగాను వీరు జీవిస్తారు.

**కృత్తికా నక్షత్రం**

కృత్తిక నక్షత్రంలో జన్మించిన వారు సాధారణంగా విద్యావంతులుగా ఉంటారు. వీరి జీవితకాలమంతా ధనవంతులుగానే జీవిస్తారు. వీరు ఆరోగ్యంగానూ, నిజాయితీగాను, ప్రకాశవంతంగానూ ఉంటారు. డబ్బుకు లోటు లేకుండా వీరి జీవితం సాగిపోతుంది.

**మఖా నక్షత్రం**

మఖా నక్షత్రంలో జన్మించిన వారికి నాయకత్వ లక్షణాలు మెరుగ్గా ఉంటాయి. మీరంతా నైతికతను కలిగి ఉంటారు. జీవితాంతం సంపద, అదృష్టాన్ని కలిగి ఉన్నవారుగా ఉంటారు. వీరి అదృష్టం కారణంగా వీరు జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారు.


**పూర్వ ఫాల్గుణి నక్షత్రం**

పూర్వఫాల్గుణి నక్షత్రంలో జన్మించిన వారు పుట్టుకతోనే అదృష్టవంతులు.వీరు పట్టిందల్లా బంగారం అవుతుంది. అందంగా ను సమర్థులుగాను ఉంటారు. చక్కగా మాట్లాడటం లోను, ఇతరులతో పని చేయించడంలోనూ, ఇతరులతో సన్నిహితంగా మెలగడంలోనూ నైపుణ్యాన్ని కనబరుస్తారు. స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన వారుగా ఉంటారు. కళల పట్ల ఆసక్తి ఉంటుంది. విలాసాలను ఇష్టపడతారు.

**ఉత్తర ఫాల్గుణి నక్షత్రం**

ఉత్తర ఫాల్గుణి నక్షత్రంలో పుట్టిన వారు ఏ రంగంలోనైనా విజయం సాధించగలిగిన వారిగా ఉంటారు. వీరు పుట్టుక నుండే సంపన్నులుగా జీవిస్తారు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉండగలిగిన వ్యక్తులుగా ఉంటారు. ఎలాంటి ప్రతికూల పరిస్థితులైన సానుకూలంగా మార్చే నైపుణ్యం వీరిలో ఉంటుంది.

# తరచూ జుట్టుకు రంగు వేస్తున్నారా? ఎంత డెంజరో తెలుసా?



జుట్టుకు రంగు వేయడం చాలా మందికి ఫ్యాషన్,స్టైల్ స్టేట్‌మెంట్‌గా మారింది. తెల్లటి వెంట్రుకలను దాచడం, రూపాన్ని మార్చుకోవడం వంటి కారణాలతో చాలామంది జుట్టుకు రంగు వేస్తుంటారు. అయితే, తరచుగా జుట్టుకు రంగు వేయడం వల్ల కొందరు అనుకోని ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. జుట్టు రంగులు మామూలుగా రసాయనాలతో తయారు చేయబడి ఉంటాయి, ఇవి జుట్టు సహజ ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ అందం కోసం మనం చెల్లించే మూల్యం ఏమిటి? జుట్టుకు రంగు వేయడం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం.


**జుట్టుకు రంగు వల్ల కలిగే దుష్ప్రభావాలు:**

హెయిర్ డైస్‌లో ఉండే రసాయనాలు జుట్టును పొడిగా చేస్తాయి. ఫలితంగా జుట్టు చిట్లిపోతాయి. కొంతమందికి హెయిర్ డైస్ వల్ల తల చుండ్రు సమస్య తీవ్రమవుతుంది. ఇది తలలో దురద, వాపు వంటి ఇతర సమస్యలకు కూడా దారితీస్తుంది. హెయిర్ డైస్‌లో ఉండే పారా-ఫెనిలీన్‌డైయామైన్ అనే రసాయనం కొంతమందికి అలర్జీని కలిగిస్తుంది. ఇది చర్మం ఎర్రబడటం, వాపు, దురద, కళ్ళు నీరు కారడం వంటి లక్షణాలకు దారితీస్తుంది. తీవ్రమైన సందర్భాల్లో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కూడా కలగవచ్చు. రంగులలో ఉన్న హార్ష్ కెమికల్స్ జుట్టు ఫాలికల్స్‌ను బలహీన పరుస్తాయి. ఇది జుట్టు ఊడిపోవడానికి కారణం అవుతుంది. ప్రత్యేకంగా, సెన్సిటివ్ స్కాల్ప్ ఉన్నవారు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉంది. సూర్యకాంతి, క్లోరిన్ వంటి వాతావరణ కారకాలు హెయిర్ డై కలిగిన జుట్టు రంగును మార్చవచ్చు. కొన్ని అధ్యయనాల ప్రకారం, తరచుగా హెయిర్ డైస్ వాడడం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌ల ముప్పు పెరుగుతుందని తెలుస్తోంది. అయితే, ఈ విషయంలో మరింత పరిశోధన అవసరం. తలకు రంగు వేసేటప్పుడు చర్మంపై రసాయనాలు తగిలే అవకాశం ఉంటుంది. ఇది చర్మ క్యాన్సర్‌కు కారణం కావచ్చు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

హెయిర్ డై వాడే ముందు చిన్న భాగంలో ప్యాచ్ టెస్ట్ చేయడం చాలా ముఖ్యం. కొత్త బ్రాండ్‌లను వాడే ముందు వాటి గురించి సరిగ్గా తెలుసుకోవాలి. రసాయనాలు తక్కువగా ఉండే సహజ రంగులను ఎంచుకోవడం మంచిది. జుట్టుకు సంబంధించిన సమస్యలకు వృత్తిపరమైన సలహా తీసుకోవడం మంచిది. హెయిర్ డైస్‌లో ఉండే రసాయనాలు గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, పిల్లలకు హానికరం. కనుక వారు జుట్టుకు రంగు వేయడం వంటి వాటికి దూరంగా ఉంటే మంచిది.హెయిర్ డైస్‌ను వాడే ముందు తలను బాగా కడగాలి. కళ్ళకు తగలకుండా జాగ్రత్త పడాలి. హెయిర్ డైస్‌ను వాడిన తర్వాత తలను బాగా శుభ్రం చేసుకోవాలి.జుట్టుకు రంగు వేయడం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి తెలుసుకున్న తర్వాత, మీరు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవచ్చు. అందం కోసం ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేయవద్దు. సహజమైన అందాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నించండి.

శాసనసభ
మంగళవారం 03 డిసెంబర్ - 2024



# అదే నేను చేసిన పెద్ద తప్పు - రకుల్

ఒకప్పుడు తెలుగులో టాప్ హీరోయిన్‌గా రకుల్ ఓ వెలుగు వెలిగిన సంగతి అందరికి తెలిసిందే. మహేష్ బాబు, ఎన్టీఆర్ , అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోల సరసన నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది.తెలుగులో నెంబర్ వన్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన రకుల్.. వరుస ఫ్లాపులతో డీలా పడిపోయింది. కోలీవుడ్, బాలీవుడ్‌లో కొన్నిసినిమాల్లో నటించినప్పటికీ అక్కడ ఆమెకు సరైన హిట్ మాత్రం దక్కలేదు.దీంతో రకుల్‌కు అవకాశాలు తగ్గిపోయాయి. ఇదే సమయంలో రష్మిక, పూజా హెగ్డె, శ్రీలీల వంటి స్టార్స్ ఇండస్ట్రీలోకి దూసుకురావడంతో రకుల్ రేసులో వెనుకపడిపోయింది. ఫొటో షూట్లు, జిమ్ వీడియోలతో గ్లామర్‌గా కనిపించినా కూడా ఫలితం లేకుండా పోయింది. రకుల్ ప్రీత్ సింగ్ ఈ మధ్య తరుచు వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా పెళ్లి తరువాత ఆమె సోషల్ మీడియాలో ఎక్కువ కనిపిస్తున్నారు.ఇదిలా ఉంటే రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా వర్కౌట్‌పై కొన్ని కామెంట్స్ చేశారు. రకుల్ ఇటీవల వర్కౌట్ చేస్తూ గాయపడింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుపుతూ ఓ పోస్ట్ పెట్టారు. ఆమె వెన్నెముకకు గాయమైందని చికిత్స తీసుకుంటున్నట్లు వెల్లడించారు. దీనిపై ఆమె స్పందిస్తూ..అక్టోబర్ 5న 80 కిలోల బరువు ఎత్తాను. అప్పుడే నా వెన్నెముకలో నొప్పి వచ్చింది. కానీ ఆ నొప్పిని నేను పట్టించుకోకుండా వర్కౌట్ చేశాను. అదే నా పాలిట శాపం అయింది.వర్కవుట్ అవ్వగానే సినిమా షూటింగ్‌కు వెళ్లాను. సాయంత్రం అయ్యేసరికి విపరీతమైన వెన్నునొప్పి వచ్చింది. కొంచెం కూడా బెండ్ అవలేకపోయాను. అయినప్పటికీ అదే తగ్గుతుందని ఆ నొప్పి భరిస్తూనే ఐదు రోజులు గడిపా. నొప్పిని తట్టుకోలేకపోయాను. బీపీ పడిపోయింది. పదిరోజులు ఆస్పత్రి బెడ్‌పై గడిపానని రకుల్ చెప్పుకొచ్చింది. నేను ఇప్పుడు బాగానే ఉన్నాను. కానీ పూర్తిగా కోలుకోలేదని తెలిపింది. రకుల్‌కు ఏమైందని అభిమానులు ఆందోళన చెందుతున్నారు.

# ‘పుష్ప2’ టికెట్ ధర రూ.800

## ఏపీలో ‘పుష్ప2’ టికెట్ ధరల పెంపు.. తెలంగాణతో పోలిస్తే మార్పులివే!




‘పుష్ప2’ టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అధికారిక జీవో విడుదల చేసింది.అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ థ్రిల్లర్ ‘పుష్ప2: ది రూల్’ . రష్మిక కథానాయిక. డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా టికెట్ ధరలు పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల బెనిఫిట్ షోతో పాటు, అర్ధరాత్రి 1 గంట షోకు కూడా అనుమతి ఇచ్చింది. రాత్రి 9.30 షోకు టికెట్ ధరను రూ.800గా నిర్ణయించారు (జీఎస్టీ అదనం). ఈ షో చూడాలంటే రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ ఏదైనా సరే రూ.8000%+ూ% చెల్లించాల్సిందే.తెలంగాణలో ‘పుష్ప2’ టికెట్ ధరల పెంపు.. బెనిఫిట్ షోలకూ అనుమతి ‘పుష్ప2’ విడుదల రోజైన డిసెంబర్ 5న ఆరు షోలకు అనుమతి ఇచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో లోయర్ క్లాస్ రూ.100 (జీఎస్టీతో కలిపి), అప్పర్ క్లాస్ రూ.150 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌లో రూ.200 (జీఎస్టీతో కలిపి) పెంచారు. డిసెంబర్ 6వ తేదీ నుంచి 17 వరకు ఐదు షోలకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబరు 17 వరకూ పెంచిన టికెట్ ధరలు అమల్లో ఉంటాయి. టికెట్ ధరలు పెంపునకు అనుమతి ఇచ్చిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు కథానాయకుడు అల్లు అర్జున్ కృతజ్ఞతలు తెలియజేశారు.’పుష్ప2’ ఆరు భాషల్లో 12 వేలకిపైగా థియేటర్లలో విడుదలకానుంది. ‘‘అత్యధిక థియేటర్లలో ఐమాక్స్ ఫార్మాట్‌లో విడుదలవుతున్న భారతీయ చిత్రమిది. సినీడబ్స్ యాప్ సహాయంతో ఏ భాషలోనైనా ఈ సినిమాని ఆస్వాదించే అవకాశం ఉంది’’ అని నిర్మాతలు ఇప్పటికే ప్రకటించారు. ఇక ‘పుష్ప2’ రన్ టైమ్ విషయానికొస్తే 3 గంటలా 20 నిమిషాల 38 సెకన్ల నిడివితో రాబోతోంది. ఇందుకు సంబంధించిన సెన్సార్ పూర్తయింది. ‘పుష్ప2’కు యూ/ఏ వచ్చినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. విడుదలకు ముందే బుక్సింగ్స్, సాంగ్స్ వ్యూస్‌తో రికార్డులు సృష్టిస్తున్న ‘పుష్ప2’ రన్‌టైమ్ పరంగానూ రికార్డు నెలకొల్పింది.

# ‘మీ భార్య మాట వినండి’.అభిషేక్ బచ్చన్



బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ పురుషులను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పెళ్లి అయ్యాక ప్రతి వ్యక్తి తన భార్య మాటే వినాలని ఆయన అన్నారు.’’మీ ప్రదర్శనలతో విమర్శకులను ఎలా సైలెంట్ చేస్తున్నారు? అది ఎలా సాధ్యమవుతుంది’’ అని అభిషేక్ బచ్చన్‌ను హోస్ట్ ప్రశ్నించాడు. దీనిపై ఆయన స్పందిస్తూ.. ‘‘ఇది చాలా సాధారణమైన విషయం. విమర్శలను పెద్దగా పట్టించుకోను. దర్శకులు చెప్పినవిధంగా చేసుకుంటూ వెళ్తాను. మన పనేదో మనం చేసుకొని సైలెంట్‌గా ఇంటికి వెళ్లిపోవడమే’’ అని బదులిచ్చారు. దీనిపై హోస్ట్ స్పందిస్తూ.. ‘‘ఇంట్లో నేను ఇదే ఫార్ములా వాడుతుంటా. నా భార్య ఏం చెప్పినా వింటా’’ అని నవ్వులు పూయించాడు. అభిషేక్ మాట్లాడుతూ.. ‘‘అవును నిజం.. పెళ్లైన పురుషులు తమ భార్య మాట వినాలి’’ అని బదులిచ్చారు. అభిషేక్ వ్యక్తిగత జీవితం గురించి ఎన్నో వార్తలు వస్తోన్న సమయంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.అభిషేక్ బచ్చన్ – ఐశ్వర్యరాయ్ వైవాహిక జీవితానికి స్వస్తి పలుకుతున్నారంటూ కొంతకాలంగా వరుస కథనాలు చక్కర్లు కొడుతున్నాయి. అందులో నిజం లేదని అభిషేక్ ఇప్పటికే పరోక్షంగా చెప్పారు. ‘‘నేను బయటకు వెళ్లి సినిమాలు చేయగలుగుతున్నానంటే అది నిజంగానే నా అదృష్టం. మా కుమార్తె ఆరాధ్య యోగక్షేమాలు చూసుకుంటూ ఐశ్వర్య ఇంట్లోనే ఉ ంటుంది. ఆ విషయంలో తనకు కృతజ్ఞతలు చెబుతున్నా’’ అని అన్నారు. మరోవైపు, ఇటీవల ఐశ్వర్య ఓ కార్యక్రమంలో పాల్గొనగా.. అందులో ఆమె పేరును బచ్చన్ లేకుండా ఉపయోగించారు. దాంతో ఈ వార్తలు మరోసారి తెరపైకి వచ్చాయి. అభిషేక్ నటించిన తాజా చిత్రం ‘ఐ వాంట్ టు టాక్’. సూజిత్ సర్కార్ తెరకెక్కించారు. ఇందులో ఆయన అర్జున్ అనే తండ్రి పాత్రలో నటించారు. ఇటీవల విడుదలై ఈ చిత్రం మిశ్రమ స్పందనలకు పరిమితమైంది.

# నన్ను అరెస్ట్ చేస్తే జైలుకెళ్తా.. నాలుగు సినిమా కథలు రాసుకుంటా



ఒకవేళ తనని అరెస్టు చేస్తే జైలుకు వెళ్తానని, అక్కడ ఖైదీలతో స్నేహం చేసి నాలుగు సినిమా కథలు రాసుకుంటానని వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ అన్నారు.’’సోషల్‌మీడియాను రెగ్యులరైజ్ చేయడం కష్టం. చట్టంలో నాకున్న అవకాశాలను బట్టి పోలీసులకు సమాధానమిచ్చా. నేను హైదరాబాద్‌లో ఉన్నాను. లైవ్‌లో ఇంటర్వ్యూలు ఇస్తున్నా. పోలీసులు ఇంకా నన్ను పట్టుకోలేదని చాలా మంది అంటున్నారు. నన్ను అరెస్టు చేస్తే జైలుకెళ్తా.. నాలుగు సినిమా కథలు రాసుకుంటా. గత కొన్నేళ్లుగా నా ఎక్స్ అకౌంట్‌లో వేల పోస్టులు పెట్టాను. వాటిలో కొన్నింటి వల్ల నలుగురి మనోభావాలు దెబ్బతిన్నాయని ఏడాది తర్వాత స్పందించారు. సంవత్సరం తర్వాత నాలుగైదుగురు ఒకేసారి మేల్కొనడం ఏంటీ? వివిధ జిల్లాల్లో నాపై కేసులు పెట్టారు. నాకున్న పనులు, కమిట్‌మెంట్స్ వల్ల నేను హాజరుకాలేనని కోర్టుకు విజ్ఞప్తి చేసుకున్నాను. నన్ను అరెస్టు చేస్తారని పోలీసులతో కలిసి కొన్ని మీడియా సంస్థలు నా డెన్‌కు (వర్మ ఇల్లు) వచ్చాయి. నేను అక్కడ లేకపోవడంతో పరారీలో ఉన్నాడని, మంచం కింద దాక్కున్నాడని కొన్ని మీడియా సంస్థలు కథనాలు అల్లాయి’’’’నా కోసం కేరళ, కోయంబత్తూరులో పోలీసులు జల్లెడ పడుతున్నారని రాశారు. నా అరెస్టు గురించి ఏ పోలీసు అధికారి అధికారికంగా చెప్పలేదు కదా! లేని న్యూస్‌ను కొందరు కావాలని సృష్టిస్తున్నారు, నా విషయంలోనూ అదే జరిగింది. సోషల్ మీడియాలో అతి చేయొద్దని అంటున్నారు. అది మీరెలా చెబుతారు. ఒక కార్టూన్ పోస్టును అనే రకాల కోణల్లో ఆపాదించుకోవచ్చు. నన్ను కోట్ చేస్తూ ప్రధాన మీడియా సంస్థలు పోస్టులు కూడా పెడుతున్నాయి. నేను హైదరాబాద్‌లోనే ఉన్నానని చెబుతున్నా, ‘పరారీలో ఉన్నాడు’ అంటారు. పోలీసులు ఇంకా వర్మను ఎందుకు పట్టుకోవడం లేదు? ప్రభుత్వం మారినా పోలీసులు వైసీపీకి మద్దతుగా పనిచేస్తున్నారని ప్రచారం చేశారు. పోలీసుల కంటే మీడియానే డిటెక్టివ్‌గా మారింది. కార్టూన్ అనేది వ్యంగ్యంగా చెప్పే ఒక అంశం. నా గురించి ఎన్నో రకాలుగా అసభ్య పదజాలంతో తిడుతూ మీమ్స్ పెడతారు. అమెరికా లాంటి దేశం కూడా మీమ్స్ ను నియంత్రించలేకపోయింది. సోషల్‌మీడియా వచ్చిన తర్వాత అది ఇంకా జటిలమైంది. ప్రతి మనిషికి వేర్వేరు ఆలోచనలు ఉంటాయి. అవి అందరికీ వర్తిస్తాయి’’ అని వర్మ అన్నారు.

# అండర్-19 ఆసియా కప్.. బోణీ కొట్టిన యువ భారత్




షార్జా: అండర్-19 ఆసియా కప్ లో భారత్ బోణీ కొట్టింది. జపాన్‌పై యువ భారత్ 211 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగుల భారీ స్కోరు సాధించింది.కొండంత లక్ష్యఛేదన లో జపాన్ 50 ఓవర్లలో 128/8కి పరిమితమైంది. దీంతో భారత్‌కు భారీ విజయం సొంతమైంది. ఓపెనర్ హ్యూగో కెల్లీ (50బీ 111 బంతుల్లో) టాప్ స్కోరర్. ఛార్లెస్ హింజ్ (35) రాణించాడు. మిగతా బ్యాటర్లెవరూ పెద్ద స్కోర్లు చేయలేదు. భారత బౌలర్లలో హార్దిక్ రాజ్, కార్తికేయ, చేతన్ శర్మ తలో రెండు వికెట్లు తీయగా.. యుధజిత్ ఒక వికెట్ పడగొట్టాడు.భారత కెప్టెన్ మహ్మద్ అమన్ (122 118 బంతుల్లో 7 ఫోర్లు) శతకం బాదడంతో జట్టుకు భారీ స్కోరు దక్కింది. ఓపెనర్ ఆయుష్ మాత్రే (54బీ 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. వైభవ్ సూర్యవంశీ (23బీ 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. కార్తికేయ (57బీ 50 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. చివర్లో హార్దిక్ రాజ్ (25లిబీ 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. యువ భారత్ తన తర్వాతి మ్యాచ్ డిసెంబరు 4న యూఏఈతో ఆడనుంది.

# ఓపెనింగ్ జోడీని మార్చొద్దు.. రోహిత్ ఆ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలి: మాజీ సెలక్టర్




టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఇప్పుడు ఏ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలనేది చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు రోహిత్‌తో పాటు శుభ్‌మన్ అందుబాటులో లేకపోవడంతో కేఎల్ రాహుల్ యశస్వి జైస్వాల్ తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించాడు. ఇప్పుడు రోహిత్, శుభ్‌మన్ తిరిగి జట్టులోకి రానుండటంతో జట్టు కూర్పు ఆసక్తికరంగా మారింది.ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ రాహులే ఓపెనింగ్ చేశాడు. రోహిత్ నాలుగో స్థానంలో వచ్చాడు. ఈ నేపథ్యంలో బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడున్న ఓపెనింగ్ జోడీని మార్చవద్దని కోరాడు.కేఎల్ రాహుల్, జైస్వాల్ భారత ఇన్నింగ్స్‌ను ఆరంభించాలని.. రోహిత్ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు రావాలని సూచించాడు. ‘‘ఐదో స్థానంలో రిషభ్ పంత్ బాగా ఆడుతున్నాడు. అందుకే రోహిత్ ఆరో స్థానంలో రావాలి. కుడి, ఎడమల బ్యాటింగ్ కలయిక బాగుంటుంది. మిడిల్ ఆర్డర్‌లో ఆడేవారు ఓపెనింగ్ చేయాలంటే కష్టమే. కానీ.. ఓపెనింగ్ బ్యాటర్ మిడిల్ ఆర్డర్‌లో ఆడటం కష్టమేం కాదు. ముఖ్యంగా రోహిత్‌కు. ఆరంభంలో అతడు ఆ స్థానంలోనే ఆడేవాడు’’ అని గాంధీ విశ్లేషించాడు.బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా రెండో టెస్టు ఆడిలైట్కడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. తొలి టెస్టులో ఘన విజయంతో టీమ్ఇండియా ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది.

# టీమ్‌లో నలుగురు లీడర్లు.. పంత్ మాతో 10-12 ఏళ్లు ఉంటాడని ఆశిస్తున్నా: సంజీవ్ గొయెంకా




ఐపీఎల్ మెగా వేలంలో రిషభ్ పంత్ చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. మొన్నటివరకు దిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా ఉన్న ఈ యువ ఆటగాడిని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఏకంగా రూ.27 కోట్లకు కొనుగోలు చేసింది.నికోలస్ పూరన్‌ను రూ.21 కోట్లకు రిటైన్ చేసుకున్న లఖ్‌నవూ.. కెప్టెన్సీ చేసిన అనుభవం ఉన్న మార్‌క్రమ్ (రూ.2 కోట్లు), మిచెల్ మార్ష్ (రూ.3.40 కోట్లు)ను వేలంలో తీసుకుంది. దిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన పంత్‌ను సారథిగా నియమిస్తారని ప్రచారం జరిగింది. అయితే, లఖ్‌నవూ మాత్రం తమ సారథి ఎవరనేది దానిపై ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఇటీవల ఆ ఫ్రాంఛైజీ యజమాని సంజీవ్ గొయెంకా ఓ కార్యక్రమంలో పాల్గొని ఐపీఎల్ వేలం గురించి మాట్లాడాడు. వేలంలో అనుసరించిన వ్యూహం పట్ల చాలా సంతోషంగా ఉన్నామని తెలిపాడు. కెప్టెన్ ఎవరనే విషయంపై మాత్రం క్లారిటీ ఇవ్వలేదు.‘వేలంలో అద్భుతమైన వ్యూహంతో ముందుకెళ్లి సక్సెస్ అయ్యామని భావిస్తున్నాం. మిడిల్ ఆర్డర్, ఫినిషింగ్‌పై దృష్టిసారించాం. మూడో స్థానం నుంచి ఎనిమిదో స్థానం వరకు మా జట్టు చాలా బలంగా ఉంది. పేస్ బౌలింగ్ విషయంలో విదేశీ ఆటగాళ్లకు బదులు భారత ప్లేయర్లను తీసుకున్నాం. బ్యాటింగ్‌లో విధ్వంసకర విదేశీ ఆటగాళ్లను దక్కించుకున్నాం.ఇప్పుడు రెండు విభాగాల్లోనూ కాంబినేషన్ బాగుంది. మేము సంతోషంగా ఉన్నాం. జట్టు సమతూకంగా ఉంది. మరే జట్టూ ఇంత బలంగా లేదు. మా టీమ్‌లో నలుగురు లీడర్లు ఉన్నారు. వారే రిషభ్ పంత్, మార్‌క్రమ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్. వీరంతా గెలవాలనే మనస్తత్వంతో ముందుకు వెళ్తారు. పంత్‌కు గెలవాలనే తపన ఉంది.పంత్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మళ్లీ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు.

# అమన్ సెంచరీ.జపాన్‌పై దంచికొట్టిన యువ భారత్



అండర్-19 ఆసియా కప్ లో భాగంగా గ్రూప్ ఎలో భారత్, జపాన్ జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్ జట్టు దంచికొట్టింది.నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ మహ్మద్ అమన్ (122లిబీ 118 బంతుల్లో 7 ఫోర్లు) శతకం బాదాడు. ఓపెనర్ ఆయుష్ మాత్రే (54బీ 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (23బీ 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు.సిద్ధార్థ్ (35) ఫర్వాలేదనిపించగా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన కార్తికేయ (57బీ 50 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. చివర్లో హార్దిక్ రాజ్ (25లిబీ 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఓపెనర్లు ఆయుష్, వైభవ్ తొలి వికెట్‌కు 65 పరుగులు జోడించగా.. అమన్, కార్తికేయ జోడీ నాలుగో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జపాన్ బౌలర్లలో హ్యూగో కెల్లీ 2, కీఫెర్ యమమోటో 2, కజుమా కటో స్టాఫోర్డ్, ఆరవ్ తివారీ చెరో వికెట్ పడగొట్టారు. ఈ టోర్నీలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 43 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918